

సేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఉత్తరాంధ్ర
మంగళవారం
25-3-2025
పేజీలు 14
విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం
శ్రీకాకుళం






ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో సోమవారం ఢిల్లీ క్యాపిటల్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ క్రికెట్ మ్యాచ్ రసవత్తరంగా జరిగింది. మ్యాచ్ ను చేజిక్కించుకునేందుకు ఇరు జట్లు శ్రమిస్తున్నాయి.

మరిన్ని చిత్రాలు 2లో





# రుషికొండ బీచ్‌కు.. మళ్లీ బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్

- రుషికొండ బీచ్ లో బ్లూఫ్లాగ్ జెండా ఎగురవేసిన మంత్రి కందుల దుర్గేష్
- బీచ్ సౌందర్యం,స్వచ్ఛతను కాపాడేలా కార్యక్రమాలుండాలి
- బీచ్ పరిశుభ్రతకు పర్యాటకులు పూర్తిస్థాయిలో సహకరించాలని పిలుపు
- భూములు అన్యాక్రాంతం అయితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించిన మంత్రి దుర్గేష్



**విశాఖపట్నం, మార్చి 24, మేజర్ న్యూస్**

విశాఖపట్నంలోని ప్రఖ్యాత రుషికొండ బీచ్ లో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ బ్లూఫ్లాగ్ జెండా ఆవిష్కరించారు. సోమవారం ఉదయాన్నే విశాఖపట్నం చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ కు అధికారులు, నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రుషికొండ బీచ్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో

..మిగతా 2లో






## సింహాద్రి అప్పన్న సన్నిధిలో మంత్రి కందుల దుర్గేష్

ఏప్రిల్ 30న జరిగే స్వామి చందనోత్సవం నాటికి ప్రసాద్ స్కీం ద్వారా చేపట్టిన ఆలయ అభివృద్ధి పనులు పూర్తిచేయాలని ఆదేశాలు జారీ
భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం



**సింహాచలం: మార్చి 24, మేజర్ న్యూస్**

రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన సింహాచల శ్రీ వరాహ స్వామి అధ్యాత్మిక క్షేత్రాన్ని కూటమి ప్రభుత్వం మరింత అభివృద్ధి చేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం విశాఖ పర్యటనలో భాగంగా మంత్రి కందుల దుర్గేష్ ప్రసిద్ధ సింహాచలం క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం (%గాఅశ్రీస్త్రతీఅఝుస్త్రవ =వయబజవఅఛ్అశీఅ ఖఅఎ గాజూఅతీఊఝుశ్రీ చాబస్త్రఎవత్ఛ్అశీఅ ఐతీఅజవ%) ద్వారా చేపడుతున్న ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఏపీ పర్యాటకాభివృద్ధికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు

..మిగతా 2లో

## ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ కు ఘన స్వాగతం

పుష్ప గుచ్ఛాన్ని అందజేసిన ఏసిఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్









**విశాఖపట్నం, మార్చి 24, మేజర్ న్యూస్**

ఐపీఎల్ లీగ్ లో భాగంగా సోమవారం వైజాగ్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఢిల్లీ క్యాపిటల్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ క్రికెట్ మ్యాచ్ ను వీక్షించేందుకు విచ్చేసిన గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, సమీరా నజీర్ దంపతులకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) , ఎసిఎ కార్యదర్శి రాజ్యసభ ఎంపి సానా సతీష్, ఎసిఎ కోశాధికారి దండమూడి శ్రీనివాస్ లతో కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికి జ్ఞాపికను కూడా బహుకరించారు. అనంతరం గవర్నర్ దంపతులతో కలిసి క్రికెట్ మ్యాచ్ వీక్షించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు వచ్చిన గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ కు ఎపిఎ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) సోషల్ మీడియా ద్వారా దన్యవాదములు తెలిపారు.

## చినముషిడివాడ శ్రీ శారదా పీఠానికి జీవీఎంసీ నోటీసు



**విశాఖపట్నం, మార్చి 24, మేజర్ న్యూస్**

ప్రభుత్వ భూమిలో ఉన్న శాశ్వత కట్టడాలను వారంలోగా తొలగించాలని మఠం మేనేజర్‌కు జీవీఎంసీ నోటీసు ఇచ్చింది. మొత్తం తొమ్మిది శాశ్వత కట్టడాలు, కొంత ఖాళీ స్థలం ప్రభుత్వ భూమిలో ఉంటాయంటూ గుర్తించినట్టు నోటీసులో జీవీఎంసీ ఎనిమిదవ జోనల్ కమిషనర్ తెలిపారు. వారంలోగా ఈ కట్టడాలు తొలగించనట్టయితే తామే వాటిని తొలగించి అందుకు అయ్యే వ్యయాన్ని మఠం నుంచి వసూలు చేస్తామని నోటీసులలో స్పష్టం చేశారు. నిన్న పెందుర్తి తాహసీల్దార్ శ్రీశారదా పీఠంలో 22 సెంట్ల వరకు ప్రభుత్వ భూమి ఉందని, దానిని ఖాళీ చేయాలని నోటీసు ఇచ్చారు. ఇవాళ కట్టడాల తొలగింపుపై నోటీసులు ఇచ్చారు.



## భారీగా గంజాయిం స్వాధీనం

**రైల్వే (లైన్స్) పోలీసుల అదుపులో ఆరుగురు ముఠా సభ్యులు**
**రెండు వేర్వేరు కేసుల్లో**
**రూ.4.60లక్షల సరకు స్వాధీనం**

**విశాఖపట్నం, మార్చి 22, మేజర్ న్యూస్ :**

అధికారులు ఎంతలా నిఘా పెడుతున్నా గంజాయి అక్రమా రవాణా ఆగడం లేదు. రైళ్లు, రైళ్ల ప్లాట్ ఫారాల్లో సరకు చేరుస్తూ అరకు, ఎస్ కోట, విజయనగరం వంటి ప్రాంతాల నుంచి ఢిల్లీ, ముంబయి వంటి ప్రాంతాలకు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారు. సరిగ్గా అలాంటి ముఠాపైనే రైల్వే (లైన్స్) ఇన్స్పెక్టర్ ఎ. రవి కుమార్, విజయనగరం రైల్వే సబ్ ఇన్స్పెక్టర్ వి.బాలాజీ రావు దృష్టి సారించారు. ఈ క్రమంలో ముంబయి/హైదరాబాద్ కు చెందిన జాఫర్ యూసఫ్ ఖురేషీ (42), అన్ను కుమారి (23), అరకు, విశాఖ మీదుగా ముంబయికి 4బ్యాగ్ ల్లో రూ.1.05లక్షల విలువైన 31కేజీల గంజాయిని రవాణా చేస్తున్నారు. అప్పటికే ముమ్మర తనిఖీలు చేపట్టిన ఇన్స్పెక్టర్ రవి బృందానికి వీరు చిక్కారు. రైల్వే డీఎస్పీ రామచంద్రరావు ఆదేశాల మేరకు ఖురేషీ, కుమారీలపై ఎన్డీపీఎస్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసి, సరకు స్వాధీనం చేసుకున్నారు. విజయనగరంలో దాడులు చేస్తున్న సమయంలో వీరి ఆచూకీ లభించింది. ఈ కేసులో రైల్వే పోలీసులు బి.ఈశ్వరరావు, ఎస్కే హుసేన్, కె. ఈశ్వరరావు, ఎ. రామకృష్ణ, పి.స్వర్ణలత, పి.చైతన్య తదితరులు ప్రతిభ కనబర్చారని ఇన్స్పెక్టర్ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

**మరో కేసులో నలుగురి అరెస్ట్**

ఎస్ కోట మీదుగా ఢిల్లీకి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నలుగుర్ని ఇన్స్పెక్టర్ రవికుమార్ బృందం మరో కేసులో ఆటకాయించింది. అక్బర్, ఇస్మాయిల్, ముఖేష్, సానియా అనే వ్యక్తులు చాన్నాళ్లుగా ఈ పని చేస్తున్నట్టు తెలుస్తోంది. విశాఖ నుంచి ఈ ముఠా ఢిల్లీకి గంజాయి చేర్చడమే లక్ష్యంగా పని చేస్తోంది. ఈ క్రమంలో 9బ్యాగుల్లో సుమారు రూ.3.05లక్షల విలువైన 61కేజీల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేపట్టామని, నలుగురిపై ఎన్డీపీఎస్ కేసు నమోదయిందని రవికుమార్ తెలిపారు.

## విశాఖ రైల్వే డిఆర్ఎంతో బిజెపి మాజీ ఎంపీ జీవీఎల్ భేటీ

**నూతన రైల్వే జోన్ నిర్మాణంపై వాకబు**
**గయకు విశాఖ నుంచి రెగ్యులర్ ట్రెయిన్ నడపాలని ప్రతిపాదన**

**విశాఖపట్నం, మార్చి 24, మేజర్ న్యూస్**

బిజెపి మాజీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన విశాఖ డిఆర్ఎం లలిత్ బోహ్రా ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మాణం ఔతున్న విశాఖ రైల్వే జోన్ భవన నిర్మాణ తీరు పై వాకబు చేసారు.. ఈ సందర్భంగా జీవీఎల్ ఆధ్వర్యంలో రాజస్థాన్, బీహార్, మరియు హర్యానాలకు చెందిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు కలిసి రైల్వేకి సంబంధించిన అనేక సమస్యలను డిఆర్ఎంకి తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా తాను గతంలో విశాఖ నుండి కాశీకి ప్రత్యేక రైలును ఏర్పాటు చేయించిన విషయాన్ని గుర్తు చేస్తూ ప్రస్తుతం విశాఖ నుండి గయా రైలును రెగ్యులర్ చేయాలని, తద్వారా గయలో పితృదేవతలకు పిండ ప్రదానాలు చేయుటకు అధిక సంఖ్యలో వెళ్లే తెలుగు రాష్ట్రాల ప్రజలకు, విశాఖ నుండి వారి స్వస్థలాలకు వెళ్లే ఇతర రాష్ట్రాల ప్రజలకు ఇది అత్యంత ఉపయుక్తంగా ఉంటుందని జీవీఎల్ డిఆర్ఎం కు తెలిపారు.వీటితోపాటుగా విశాఖపట్నం నుంచి జోధ్పూర్ కు ప్రయాణించే రైలు ప్రతిరోజు ప్రయాణించే విధంగా ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. అంతేగాక ప్రస్తుతం నిజాముద్దీన్ వరకు మాత్రమే ప్రయాణిస్తున్న సమతా ఎక్స్ప్రెస్ ను హర్యానాలోని హిస్సార్ వరకు పొడిగించాలని కోరారు.



# రుషికొండ బీచ్‌కు మళ్లీ బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్



(మొదటి పేజీ నుంచి తరువాయి)

మంత్రి దుర్గేష్ ప్రసంగిస్తూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ తాత్కాలికంగా రద్దు అయిందని, తమ దృష్టికి రాగానే వెంటనే దాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు అన్నీ తీసుకున్నామన్నారు. అంతర్జాతీయ పర్యాటకుల ఆకర్షణకు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ తోడ్పడుతుందని ఈ నేపథ్యంలో బీచ్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ బీచ్ లో బ్లూ ఫ్లాగ్? నిరంతరంగా ఉండేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ ?ల నేతృత్వంలో ప్రత్యేక కార్యచరణ ఏర్పాటు చేసుకున్నామన్నారు. బీచ్ లను పరిశుభ్రంగా ఉంచాల్సిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. బ్లూఫ్లాగ్ బీచ్ పదికాలాల పాటు నిలబడాలన్నా, పర్యాటకులను విశేషంగా ఆకర్షించాలన్నా ప్రజలు, స్థానికుల భాగస్వామ్యం చాలా అవసరమన్న అభిప్రాయాన్ని మంత్రి దుర్గేష్ వ్యక్తం చేశారు.నిర్వహణ సామర్థ్యం పెంపొందించుకునేందుకు నాయకులు, అధికారులు, ప్రజలు సమైక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఇటీవల బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ ను డెన్మార్క్ కు సంబంధించిన సంస్థ తాత్కాలికంగా మాత్రమే ఉపసంహరించిందనే విషయాన్ని గుర్తుచేశారు. పూర్తిగా రద్దుచేస్తామని సంబంధిత నిర్వాహకులు ఎక్కడా చెప్పలేదన్నారు. తాత్కాలిక ఉపసంహరణ ద్వారా నిర్వహణ సామర్థ్యం పెంచుకునే బాధ్యతను గుర్తుచేసిందన్నారు. ఈ క్రమంలో విశాఖ రుషికొండ బీచ్ కి బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పునరుద్ధరణ జరిగిందన్నారు. రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టులు తీసుకురావడం సులభమే కానీ వాటి సమర్థ నిర్వహణకు సమైక్యంగా పనిచేయాల్సిన అవసరముందని మంత్రి దుర్గేష్ అభిప్రాయపడ్డారు. బీచ్ ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా చెత్తవేయకూడదని, సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలు సహా ఏది పడితే అది విసిరివేయకూడదని, నీటిని కలుషితం చేయకూడదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పర్యాటకులకు, ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ఈ ప్రదేశంలో నిర్ణయించిన నిర్దేశిత విధానాలను ప్రజలు పాటించేలా ప్రోత్సహించాలన్నారు. బీచ్ కు అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు ఈ బ్లూ ఫ్లాగ్ తోడ్పడుతుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. దీనివల్ల బీచ్?లోని పరిశుభ్రత, ఇతర సదుపాయాలు అన్ని సక్రమంగా నిర్వర్తించాల్సిన బాధ్యత పర్యాటక శాఖపై ఉందని చెప్పారు.



**పర్యాటక శాఖపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించింది:మంత్రి దుర్గేష్**

రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక శాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించిందని తెలుపుతూ కొత్త పర్యాటక పాలసీని తీసుకొచ్చామని, పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించామని గుర్తుచేశారు.ఈ నేపథ్యంలో ప్రత్యేకించి విశాఖపట్నంలోని పర్యాటక శాఖ అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేసి పర్యాటకాభివృద్ధికి కృషి చేయాలన్నారు. విశాఖను అందంగా నిర్మించేందుకు అందరం మరింత కష్టపడదామన్నారు. ఈ క్రమంలో బాంబూ పాసింగ్ పేస్ లాంటివి ఏర్పాటు చేద్దామన్నారు.బీర్, వైన్ తదితర బీచ్ శాక్స్ ను ప్రవేశపెట్టి అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షిస్తామన్నారు. తద్వారా పర్యాటకాభివృద్ధితో పాటు ఆర్థికంగా కూడా బలోపేతం అయ్యేందుకు అవకాశముంటుందన్నారు. ఈ అంశాన్ని సీఎం దృష్టిలో ఉంచామన్నారు. త్వరలోనే నిర్ణయం వెలువడుతుందని భావిస్తున్నామన్నారు.

**స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం: మంత్రి దుర్గేష్**

రాష్ట్రంలోని 974 కి.మీల సుదీర్ఘ సముద్ర తీరంలో ఉన్న ఎన్నో బీచ్ ల్లో విశాఖలోని రుషికొండ బీచ్ కు ఒక ప్రత్యేకత ఉందని తెలిపారు. సహజ సిద్ధ అందాలు, చుట్టూ ఉన్న ప్రకృతి సంపద, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ జ్ఞానాన్ని అందించేలా బ్లూఫ్లాగ్ బీచ్ తయారుకావాలన్నారు.రుషికొండ సాధారణ బీచ్ కాదని కష్టపడి బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ తెచ్చుకున్నామని వివరించారు. బీచ్ లో సౌందర్యానికి, స్వచ్ఛతకు పెద్దపీట వేయాలన్నారు. బీచ్ లో అంతర్జాతీయ ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తద్వారా స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.స్థానికంగా ఉపాధి పొందుతున్న మత్స్యకారుల జీవితాలు ఇబ్బంది పడకుండా చూసే బాధ్యత తమదన్నారు. నిబంధనల ప్రకారం ఎన్ని కార్యక్రమాలు చేసినా ప్రజాప్రతినిధులుగా మానవీయ కోణం ఆవిష్కరించే బాధ్యత తమకు ఉంటుందన్నారు.ఇక్కడ భూములు అన్యాక్రాంతం అయితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. స్థానిక ప్రజల అవసరాలు గుర్తిస్తామన్నారు. తదనుగుణంగానే తమ పద్ధతులుంటాయన్నారు. అంతిమంగా రుషికొండలో బ్లూఫాగ్ బీచ్ రెపరెపలాడేలా చేశామన్నారు. కూటమి ప్రభుత్వం కూడా రెపరెపలాడే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రజలదే అన్నారు. బ్లూఫ్లాగ్ అజరామంగా నిలిచేందుకు తాము కృషి చేస్తామన్నారు. ఉగాది నుండి ప్రజల భాగస్వామ్యంతో పరిపాలన ఎలా జరపాలి అన్న అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యక్రమం ప్రారంభించబోతున్నారని తెలిపారు. తద్వారా పరిపాలనో ప్రజల భాగస్వామ్య ఆవశ్యకతను



వివరించనున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా పర్యాటకాభివృద్ధిని ప్రోత్సహిస్తోన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట పర్యాటకశాఖ అభివృద్ధికి చేస్తున్న కృషిని మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మంత్రి దుర్గేష్ పలువురికి లైఫ్ జాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీటీడీసీ ఛైర్మన్ డా.నూకసాని బాలాజీ, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, పర్యాటక శాఖ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సింహాద్రి అప్పన్న సన్నిధిలో మంత్రి కందుల దుర్గేష్









(మొదటి పేజీ నుంచి తరువాయి)

కేంద్ర ప్రభుత్వం నుండి మంచి సపోర్ట్ ఉందని తెలుపుతూ పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడవద్దని కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు.సకాలంలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.నాణ్యత విషయంలో పొరపాట్లు దొర్లితే సహించేది లేదని హెచ్చరించారు. ఏప్రిల్ చివర్లో జరిగే చందనోత్సవం కార్యక్రమానికి క్యూ లైన్ పనులు, టాయిలెట్స్, బాత్ రూమ్స్ తదితర పనులు పూర్తి చేయగలిగితే భక్తుల తాకిడిని నియంత్రించవచ్చన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. మే నాటికి పనులు పూర్తి చేసి భక్తులకు పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. గతంలో సింహాచలం దర్శనానికి వచ్చే భక్తులు కేవలం దర్శనం మాత్రమే చూసుకొని వెనుదిరిగేవారన్నారు. చుట్టు ప్రక్కల ప్రాంతాలను చూసేందుకు అవసరమైన వసతులు ఉండేవి కావన్నారు. ప్రస్తుతం సింహాచలంకు వచ్చే భక్తులు దర్శనంతో పాటు నాలుగైదు రోజులు ఉండి చుట్టు ప్రక్కల ప్రదేశాలను చూసే విధంగా టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసి హోటల్స్, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. విశాఖలో బీచ్, అడ్వెంచర్, ఎకో, క్రూయిజ్ టూరిజం ప్రక్రియలను పర్యాటకులు అనుభవించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.లంబసింగిలో మంచి రిసార్ట్స్ లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. బొర్రా గుహలను మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. పదుల సంఖ్యలో థీమాటిక్ అప్రోచ్ లతో ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రస్తుతమున్న ప్రసాద్ స్కీంలో క్యూ కాంప్లెక్స్, ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా బట్టలు మార్చుకునే గదులు,స్నానాలు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. వసతి కల్పన ఇందులో పొందుపరచలేదన్నారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన కెఫ్టేరియా ఉందన్నారు. భవిష్యత్ లో వేరే స్కీం లో వసతి సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రసాద్ స్కీం నిధుల విషయంలో ప్రభుత్వాల మార్పుతో, పనుల ప్రదేశాల మార్పు వల్ల కొంత జాప్యం జరిగిందన్నారు. నిధుల రాక కోసం పనులు పూర్తి చేసినట్లుగా యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నిధుల విడుదలకు ఏ ఇబ్బందిలేదన్నారు. దశలవారీగా నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి స్వయంగా చెప్పినట్లుగా మంత్రి దుర్గేష్ వెల్లడించారు.భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు.

**ప్రసాద్ స్కీం ద్వారా అన్నవరంలో అభివృద్ధి కార్యక్రమాలు: మంత్రి దుర్గేష్**

ప్రసాద్ స్కీం క్రింద అన్నవరం పుణ్యక్షేత్రంలో కూడా పనులు జరుగుతున్నాయని మంత్రి దుర్గేష్ వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి, అంకిత భావాన్ని చూసి కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున సపోర్ట్ చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.ఏప్రిల్ నుండి నాలుగైదు ప్రధాన కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం సహకారంతో చేపట్టనున్నామన్నారు.

**పర్యాటక రంగం అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది: మంత్రి దుర్గేష్**

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.99 కోట్లతో అఖండ గోదావరి, రూ.77 కోట్లతో గండికోట ప్రాజెక్టులను చేపట్టామన్నారు. ఇప్పటికే అఖండగోదావరి ప్రాజెక్టులకు టెండర్లు పూర్తయ్యాయన్నారు. గండికోటకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం వెల్లడించారు. త్వరితగతిన ఆయా ప్రాజెక్టుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇటీవల విశాఖపట్నంలో రీజినల్ ఇన్వెస్టర్ సమ్మిట్ నిర్వహించామని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. పీపీపీ విధానంలో పర్యాటకాభివృద్ధి చేస్తున్నామన్నారు. పర్యాటక రంగంలో చాలా మంది ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని గుర్తుచేశారు. 8 ఎంవోయూలు సైతం కుదుర్చుకున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని బీచ్ లకు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు సైతం మంచి స్ఫూర్తితో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను కలిసినప్పుడు ఏపీకి మరిన్ని ప్రాజెక్టులు కేటాయించేందుకు సుముఖత వ్యక్తం చేశారని గుర్తుచేశారు. రాష్ట్రానికి మంచి విజనరీ నాయకులు సీఎంగా, డిప్యూటీ సీఎంలుగా ఉన్నారని కేంద్రం నుండి ఎప్పుడూ ఏ సపోర్ట్ కావాలన్నా అందించేందుకు ముందుకు వస్తామని తెలిపినట్లు మంత్రి వివరించారు. అంతకుముందు వేదమంత్రోచ్ఛరణల మధ్య మంత్రి కందుల దుర్గేష్ సింహాచలం శ్రీ వరాహ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి దర్శనం చేసుకున్నారు.ఈ క్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు,అధికారులు మంత్రి దుర్గేష్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి కప్పస్తంభం ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత మంత్రి దుర్గేష్ కు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదం అందజేశారు. అదే విధంగా ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని మంత్రి దుర్గేష్ కు అందజేశారు













## ఉత్తమ హెల్త్ అసిస్టెంట్ గా ఎల్ సత్యారావు




కొత్తవలస. మార్చి 24 మేజర్ న్యూస్

ప్రపంచ టీబీ డే సందర్బంగా విజయనగరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారిణి డా జీవన రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డా రాణి గారి చేతులు మీదుగా బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు ని పీహెచ్సి వియ్యంపేట కి డా " సింహాద్రినాయుడు అందుకుకోగా. బెస్ట్ హెల్త్ అసిస్టెంట్ గా ఎల్. సత్యారావుకు వారి చేతుల మీదుగా సోమవారం లో అందజేశారు. టీబీ వ్యాధి నిర్మూలన లో భాగంగా 100 డేస్ టీబీ ఎలిమినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ డిసెంబర్ 7%ష్ట్ర% న ప్రారంభించారు. 100 డేస్ టీబీ కాంపెయిన్ లో పీహెచ్సి వియ్యంపేట ఎక్స్ రే లు, స్పూటుం కలెక్టన్ లోను రిపోర్ట్స్, రికార్డ్స్ సక్రమంగా నిర్వహించడం లోను ప్రగతి సాధించడం,మరియు టీబీ రోగులు కి సక్రమంగా క్రమం తప్పకుండ మందులు మింగించడం వలన పీహెచ్ సి కి బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు వచ్చినట్లు వైద్యాది కారి డా " గోపాలకృష్ణ తెలిపారు. క్షేత్ర స్థాయి లో ప్రజలు కి అందుబాటులో ఉంటూ టీబీ వ్యాధి పట్ల అవగాహనా కల్పించి పీహెచ్ సి సిబ్బంది ఎమ్. ఎల్. హెచ్. పి. లు,ఏ.ఎన్ ఏమ్స్, ఆశ వర్కర్స్ కోఆర్డినేషన్ తో 100 డేస్ టీబీ కాంపెయిన్ లో వల్నర్ బుల్ గ్రూప్స్ ఎక్స్ రే లు తీయించండం లో, స్పూటుం కలెక్టన్ లో టార్గెట్ అచీవ్ అవ్వడం లో సత్యారావు ప్రధాన భూమిక పోషించినందుకు బెస్ట్ హెల్త్ అసిస్టెంట్ అవార్డు ఇచ్చి నట్లు వైద్యాధికారి తెలిపారు. పీహెచ్ సి కి అవార్డు రావడం లో సూపర్ వైజర్స్,, క్షేత్ర స్థాయి సిబ్బంది బాగా పని చేసి నందుకు సిబ్బంది ని వైద్యాధికారి అభినందించారు.

## పి.జి.ఆర్.ఎస్.అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

### -జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి



అనకాపల్లి ప్రతినిధి, మార్చి 24, మేజర్ న్యూస్:

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీలను గడువులోపల పరిష్కరించాలని జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, కె.ఆర్.సి.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, గృహనిర్మాణశాఖ ప్రోజెక్టు డైరెక్టరు వై. శ్రీనివాస్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.
పి.జి.ఆర్.ఎస్. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, అర్జీలు రీ-ఓపెన్ కాకుండా అర్జీ పరిష్కారం అనంతరం అర్జీదారునితో మాట్లాడి పూర్తివివరాలు తెలియజేయాలని జాయింటు కలెక్టరు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టర్ల సదస్సులో నియోజకవర్గ సమస్యలు ప్రస్తావించండి

### - ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి.



నరసన్నపేట మార్చి 24 మేజర్ న్యూస్ :

నరసన్నపేట నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ల సదస్సులో ప్రస్తావించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే కలెక్టర్ల సదస్సులో వంశధార కాలువల షట్టర్ల మరమ్మతులు, గార - వనితమండలం వంతెన నిర్మాణం పనులు వేగవంతం, పొలాల్లో మిగులు ధాన్యం కొనుగోలు, త్రాగునీటి సమస్యలు, అంతర్గత సిసి రహదారులు, మురుగునీటి కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అంశాలను, మా నియోజకవర్గము తరపున తెలియజేయాలని శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి సోమవారం జిల్లా పరిషత్ లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కు వినతి పత్రం అందించారు. ఈ సమస్యలు ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన పాల్గొన్నారు.

## హెూం మినిస్టర్ అనితకు పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపిన తోట నగేష్.



పాయకరావుపేట మార్చి 24 మేజర్ న్యూస్.

అడ్డురోడ్డు లో హెూం మినిస్టర్ స్వగృహం వద్ద నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్,జనసేన నాయకులు తోట నగేష్ పాల్గొని వంగలపూడి అనితకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు.

## హెూంమంత్రి వంగలపూడి అనిత పుట్టినరోజు సందర్భంగా దుప్పట్లు మజ్జిగ పంపిణీ.



పాయకరావుపేట మార్చి 24 మేజర్ న్యూస్.

రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత పుట్టినరోజు సందర్భంగా టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు తుని పాయకరావుపేట భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి హెూంమంత్రికి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు విచ్చేశారు.అనంతరం భవన నిర్మాణ కార్మికులకు దుప్పట్లు మజ్జిగ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గుటూరు శ్రీనివాసరావు, కలిగట్ల శ్రీను,తెదేపా యువ నాయకుడు గొల్లపల్లి నాగు,పడాల కోటి,సఖిలేటి నాగేశ్వరరావు,కోడూరు నూకరాజు,గంటా థామస్,భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## "అర్ధరాత్రి భీకర గాలుల భీభత్సం "

### -ఫైర్ స్టేషన్ వద్ద విరిగిన విద్యుత్ ట్రాన్స్ఫార్మార్ స్తంబాలు. -కర్లెమ్మ పంచాయితీ లో నిలిచిన విద్యుత్ సరఫరా.-మంచినీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు.





కొత్తూరు మార్చి 24 (మేజర్ న్యూస్ )

కొత్తూరు మండల పరిసర ప్రాంతాల్లో ఆదివారం అర్ధ రాత్రి సమయంలో ప్రకృతి భీభత్సం సృష్టించింది. వీచిన భారీ పెనుగాలులకు చెట్లు, విద్యుత్ స్థంబాలు నెలకొరిగాయి. ఆదివారం అర్ధ రాత్రినుండి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం పన్నెండు గంటల తర్వాత విద్యుత్ శాఖ అధికారులు మరమ్మత్తులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్దరించారు. సరఫరా నిలిచిపోవడం తో మంచినీరు కోసం మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనేక ఇళ్లల్లో స్నానానికి నీరు లేదు. తాత్కాలిక వినియోగం కోసం కూడ మహిళలు పడరాని పాట్లు పడడం గమనార్హం. నేల బావులు ఉన్న ఇండ్లు తప్ప గొట్టపు బావులు గల ఇండ్ల యజమానులు బాధలు వర్ణాతీతం. స్థానిక ఫైర్ స్టేషన్ వద్ద గల ట్రాన్సపార్మార్ వద్ద విద్యుత్ స్తంబాల పై చెట్లు విరిగి పడి పోవడంతో సరఫరా నిలిచి పోగా మరికొన్ని చోట్ల విద్యుత్ వైర్లు తెగిపోయాయి. రాత్రి మూడు గంటల నుండి విద్యుత్ అధికార్లు అప్రమత్తమై సరఫరా పునరుద్దరణ కు చర్యలు చేపట్టిన ఫలితం లేకపోయింది. ఫైర్ స్టేషన్ వద్ద గల ట్రాన్సపార్మార్ పై పడిన చెట్లు తొలగించేందుకు లైన్ మేన్ చిట్టిబాబు ఆధ్వర్యంలో ముమ్మరం గా పనులు చేపట్టి మరమ్మత్తులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్దరించారు. పెనుగాలులకు అరటి, బొప్పాయి తోటలు నేల కొరిగాయి. వడగండ్ల వానకు కూరగాయలు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పూత , పిందెలు లతో ఉన్న జీడీ మామిడి తోటలు ధ్వంసమయ్యాయి. జీడీ , మామిడి రైతులకు అపార నష్టం వాటిల్లింది.పంటకు వచ్చిన మొక్కజొన్న కు భారీ నష్టం చోటుచేరసుకోంది.

## క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడితే కఠిన చర్యలు.

### -కొత్తూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ చింతాడప్రసాదరావు హెచ్చరిక.

కొత్తూరు మార్చి 24(మేజర్ న్యూస్ )

క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడిన , సహకరించిన కఠిన చర్యలు తీసుకొంటామని కొత్తూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ చింతాడ ప్రసాదరావు తీవ్రంగా హెచ్చరించారు. రాష్ట్ర డిజిపి ఆదేశాలు మేరకు బెట్టింగు లు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారని ఆయన అన్నారు. క్రికెట్ బెట్టింగ్ లు పాల్పడిన, వారికి సహకరించిన నేరమేనని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు.అమాయక ప్రజలు, యువత ను లక్ష్యంగా చేసుకొని క్రికెట్ బెట్టింగుల ద్వారా ఎక్కువ సొమ్ము సంపాదించవచ్చునని ప్రలోభాలు పెట్టి క్రికెట్ బెట్టింగ్ లు నిర్వహిస్తున్న వారిని విడిచిపెట్టే ప్రసక్తి లేదని ఆయన అన్నారు. అటువంటి వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినం గా శిక్షిస్థామని సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు అన్నారు. ఐపియల్ సీజన్ లో అన్ లైన్, ఆఫ్ లైన్,బుకీల కదలికలు పి ప్రత్యేక క పోలీస్ నిఘా ఉంచినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు అన్నారు.క్రికెట్ బెట్టింగులు నిర్వహించే వ్యక్తుల సమగ్ర సమాచారం, పూర్తి వివరాలు పోలీస్ ల వద్ద ఉందని , వారు జాగ్రత్త గా ఉండాలని ఆయన హేచ్చరించారు. క్రికెట్ వినోదం కోసమే చూడాలని బెట్టింగులకు కాదని, ప్రజలు వాటిపై మొగ్గు చూపరాదని సిఐ ప్రసాదరావు అన్నారు.

## ప్రజా వినతుల పరిష్కార వేదిక కు 275 వినతులు



విజయనగరం బ్యూరో ,మార్చి 24 , మేజర్ న్యూస్ :

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికకు 275 వినతులు అందాయి. అధికంగా రెవిన్యూ శాఖకు 117, మునిసిపల్ శాఖకు 17, ఉపాధి హామీ కు 11, దేవాదాయ శాఖకు 46, పోలీస్ శాఖ కు 31 డి.ఆర్.డి.ఏ.కు 19, జిల్లా పంచాయతీ శాఖకు 10, విద్యుత్ పంపిణీ సంస్థకు 5, వైద్య ఆరోగ్యశాఖ 5, పాఠశాల విద్యాశాఖకు 4 చొప్పున వినతులు అందాయి.ఈ వినతులను సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీలా గాంధీ స్వీకరించారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు సిపిఐ పోరుబాట

### -పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు -గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలి - సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య




విజయనగరం టౌన్ , మార్చి 24 , మేజర్ న్యూస్ :

కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటి వరకూ పేదలకు ఇళ్ల నిర్మాణం, స్థలాల మంజూరుకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీంతో పట్టణ , గ్రామీణ ప్రాంతాల్లో సొంతింటి కళ నెరవేర్చుకోవాలన్న ఆశ సామాన్య కుటుంబాలకు అందని ద్రాక్షగా మిగిలిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఈశ్వరయ్య ఆరోపించారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయిలు ప్రభుత్వ ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం సీపీఐ విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ నేతృత్వంలో మార్క్స్ నగర్ నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కొన్ని డివిజన్లలో ఉన్న లబ్ధిదారుల ఇంటి స్థలాలు దరఖాస్తులు మాత్రమే మొదటి విడతగా ఈరోజు తహశీల్దారుకు అందజేయడం జరుగుతుందని ఇంకా మిగతా అన్ని డివిజన్లు నుంచి దరఖాస్తులు కూడా రెండవ విడతలో అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునే కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందిస్తే ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. సర్వేల పేరుతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందనే విమర్శలు విన్పిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ సక్రమంగా ముందుకు సాగలేదని కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సాయం పెంచడంతో ఇళ్లు కట్టుకునేందుకు సొంత స్థలం ఉన్నవారు చాలా మంది ముందుకొస్తున్నారనీ అన్నారు. గ్రామాల్లో ఇంకా గృహ నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ మొదలు కాలేదని అధికారులు చెబుతున్నారు. 2014-19 టిడిపి పాలనలోనే ఇదే పరిస్థితి నెలకొంది. తొలుత మూడేళ్లపాటు ఇళ్ల నిర్మాణాలకు అవకాశం ఇవ్వకుండా తర్వాత ఇచ్చారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే సరికి 2019 ఎన్నికలు దగ్గరపడ్డాయి. టిడిపి ఓటమి పాలైంది. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గృహనిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. పట్టణ ప్రాంతంలో రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలివ్వాలని గతంలో అనేకసార్లు అర్హులైన వారితో వ్యక్తిగత అర్జీలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. గత ఐదేళ్లు పాలించిన జగన్ రెడ్డి రాష్ట్రంలో 30 లక్షల ఇల్లు నిర్మిస్తామని రాబోయే కాలంలో ఇంటి స్థలాలు ఇల్లు అడిగే పేదవారు లేకుండా చేస్తానని వాగ్దానం చేసి చేతులెత్తేసాడని ఆరోపించారు. పేదలను మరింత పేదవారిని చేసి గద్దె దిగిపోయాడని విమర్శించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రెండు సెంట్లు, మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల అని చెప్పి ఇంతవరకు దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.ఇళ్ళు, టిడ్కోఇళ్ళను లబ్ధిదారులకు పూర్తిగా అప్పగించకుండ నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలు అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు ఇళ్ళ స్థలాలు, ఇంటి పట్టాలు పేదలు నివసించే ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, ఎన్.నాగభూషణం, మార్క్స్ నగర్ శాఖ కార్యదర్శి అప్పరుబోతు జగన్నాధం, సహాయ కార్యదర్శి బూర వాసు, శాంతి నగర్ శాఖ సహాయ కార్యదర్శి వెలగాడ రాజేష్, బల్జివీధి శాఖ కార్యదర్శి పొందూరు అప్పలరాజు, ఏఐటీయూసీ నాయకులు పొడుగు రామకృష్ణ, అల్తి మరయ్య మరియు ఇళ్ళ స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్న మహిళలు హాజరయ్యారు.

## ఆలయ నిర్మాణానికి 30 వేలు విరాళం

విజయనగరం టౌన్ , మార్చి24 , మేజర్ న్యూస్ :



విజయనగరం నియోజకవర్గంలో కోరుకొండ గ్రామంలో దుర్గాదేవి ఆలయ నిర్మాణం కోసం జనసేన పార్టీ సీనియర్ నేత గురాన అయ్యలు విరాళం అందజేశారు..సోమవారం తన కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు 30 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక , సామాజిక కార్యక్రమాలకు తన వంతు సహకరం ఎల్లప్పుడు వుంటుందన్నారు

## జగన్నాధపురం గ్రామపంచాయతీ సచివాలయంలో పి 4 సర్వే గ్రామసభ విజయవంతంగా నిర్వహణ:




బొబ్బిలిరూరల్, మార్చి 24: మేజర్ న్యూస్:

బొబ్బిలి మండలం జగన్నాధపురం గ్రామపంచాయతీ సచివాలయంలో సోమవారం పి 4 సర్వే గ్రామసభ ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి సర్పంచ్ బొద్దల పద్మ అధ్యక్షతన నిర్వహించగా, గ్రామాభివృద్ధి పట్ల ప్రజల చైతన్యాన్ని పెంపొందించేలా కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు రౌతు తిరుపతిరావు, సర్పంచ్ ప్రతినిధి బొద్దల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఆశాజ్యోతి, కృష్ణాపురం సర్పంచ్ గంట సింహాచలం, ఉపసర్పంచ్ భోగి పాపారావు పాల్గొని విలువైన సూచనలు అందించారు.అదనంగా, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని గ్రామ అభివృద్ధికి తమ మద్దతును తెలిపారు. గ్రామ సమస్యలు, పథకాల అమలు, భవిష్యత్ ప్రణాళికలపై సమావేశంలో చర్చించబడింది.ఈ సర్వే ద్వారా గ్రామ ప్రజలకు మరింత అవగాహన కల్పించి, అభివృద్ధికి మరో మెట్టుపెట్టేలా జగన్నాధపురం గ్రామపంచాయతీ కృషి చేస్తుంది.

## రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చర్చ్ సెంటర్లో రాస్తారోకో: సిఐటియు



బొబ్బిలి మార్చి 24: మేజర్ న్యూస్:

రవాణా రంగాన్ని రక్షించుకోవడానికి కార్మికుల సమస్యల పరిష్కారానికి మార్చి 24 సోమవారం దేశవ్యాప్తంగా రాస్తారోకోలు నిరసనలు జరపాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు పిలుపునిచ్చింది. అందులో భాగంగా బొబ్బిలి చర్చి సెంటర్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు ఆధ్వర్యంలో రాస్తారోకో జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ లను నేరుగా పాత పద్ధతిలోనే రవాణా శాఖ నిర్వహించాలి. ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం బి.ఎన్.ఎస్. 2023 సెక్షన్ 106(1)%ఒ%(2) ని ఉపసంహరించుకోవాలి. డ్రైవర్లకు చిన్నచిన్న తప్పిదాలకు భారీ జైలు శిక్షలు విధించే విధంగా డ్రైవర్ల జీవితాలకు ఉరితాడుగా మారిన ఈ సెక్షన్లు ఉపసంహరించుకోవాలి. ప్రమాదాలు జరగకుండా రోడ్ల డిజైన్ మార్చాలి జీవో నెంబర్ 21 ట్రాన్స్పోర్ట్ కార్మికులపై విపరీతమైన ఫైన్లు విధించే జీవో 21 రద్దు చేయాలి. కుటుంబ పోషణ భారంగా ఉన్న రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వం విపరీతమైన ఫైన్ తో ఆదాయ వనరుగా చూడటం అన్యాయం కార్మికుల రక్తం పీల్చి పిప్పి చేయడమే అని అన్నారు తక్షణమే ఆ జీవోలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు టోల్ టాక్స్ లు విపరీతంగా పెంచారు. గతంలో నెల కార్డులు రోజువారిలో ఒకసారి చెల్లిస్తే ఎన్నిసార్లు అయినా ప్రయాణంకు ఉంది. వెళ్లిన ప్రతిసారి టోల్ చెల్లించే విధంగా మార్పు, టోల్ ట్యాక్స్ పెంచడం ప్రజలకు, రవాణా కార్మికులకు పూర్తిస్థాయిలో నష్టం తక్షణమే పెంచిన టోల్ టాక్స్ ఉపసహరించుకోవాలి. రవాణా రంగం కుదేలు కావడానికి కారణమైన పెరిగిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలి రవాణా రక్షణకై రవాణా రంగ కార్మికులు మే 20 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ నాయుడు మోహన్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం:తహసీల్దార్ శ్రీను



బొబ్బిలిరూరల్, మార్చి 24: మేజర్ న్యూస్

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎం శ్రీను తెలిపారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా అధికారులు నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్సో భాగంగా,బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయం నుంచి విసీలో పాల్గొంటు,ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరిస్తున్న బొబ్బిలి తాసిల్దార్ ఎం శ్రీను బాగా మరియు ఎమ్మార్వై రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ నివారణ కు ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

### -పార్వతీపురం ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీ వాస్తవ







పార్వతీపురం, మార్చి 24, మేజర్ న్యూస్ :

క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ(టి.బి) నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలిని సోమవారం నిర్వహించారు. అనంతరం ఎన్ జి ఓ హోమ్ లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశుతోష్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దగ్గు వస్తే సాధారణ దగ్గుగానే భావిస్తున్నామని, దానిని నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రస్తుతం మాస్కు ధరించడం జరుగుతుందని తద్వారా వ్యాప్తి నివారణకు దోహదం చేస్తుందని ఆయన అన్నారు. క్షేత్ర స్థాయిలో సర్వే చేసి క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని వైద్య సిబ్బంది గుర్తించాలన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కఫం పరీక్షలు చేయడం జరుగుతుందని, ఎక్స్ రే యంత్రాలు, ఆధునికమైన సిబినాట్, 19 ఆర్ టిపిసిఆర్ టిబి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలకు సరిపడా మందులు ఉచితంగా ఇవ్వడమే కాకుండా ప్రతీ నెలా వెయ్యి రూపాయలు చొప్పున ఆరు నెలలు వ్యాధి బాధితుల ఖాతాలో జమ అవుతాయన్నారు. మందులు క్రమం తప్పకుండా వేసుకునేలా సిబ్బంది పర్యవేక్షణ చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి టి.బి. ముక్త భారత్ అభియాన్ క్రింద వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ మిత్ర దాతల ద్వారా పోషకాహారం అందజేయడం జరుగుతుందని తెలిపారు. లయన్స్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రెడ్ క్రాస్, వర్తక సంఘాలు, ప్రభుత్వ అధికారులు నిక్షయ్ మిత్రగా చేరి భాగస్వాములు అవుతున్నారని, ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని, టిబి రహిత జిల్లా గా తీర్చు దిద్దేందుకు సహరించాలని కోరారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ భాస్కరరావు మాట్లాడుతూ క్షయ ఒక అంటువ్యాధి అని రోగి దగ్గి నప్పుడు, తుమ్మి నప్పుడు క్షయ క్రిములు గాలి ద్వారా ఇతరులకు వ్యాపిస్తాయన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, కఫం, జ్వరం ఉండటం, బరువు తగ్గుట, ఆకలి మందగించటం, ఉమ్మిలో రక్తం పడటం మొదలకు లక్షణాలు ద్వారా గుర్తించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వైద్యులు, వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నియత్రణ అధికారి డాక్టర్ ఎం. వినోద్ కుమార్, ఆర్ బి ఎస్ కె జిల్లా సమన్వయ అధికారి డా పి ఎల్ రఘు కుమార్, ఎన్ జి ఓ జిల్లా అధ్యక్షులు జివి ఆర్ ఎస్ కిషోర్, ఐ ఎం ఎ జిల్లా అధ్యక్షులు డా. యాళ్ల వివేక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నేనెప్పుడూ అందుబాటులో ఉంటా

### -ప్రజా సమస్యలు పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం -ప్రజాదర్బార్లో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



పార్వతీపురం, మార్చి 24, మేజర్ న్యూస్ :

ప్రజలకు నేనెప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజా సమస్యలు పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, సమస్య విన్నవించిన వెంటనే పరిష్కరించడమే మా లక్ష్యం అని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాదరార్లో ఆయన ప్రజల సమస్యలను వినతుల రూపంలో స్వీకరించారు. ఈ మేరకు రోడ్లు, కాలువలు, పింఛన్లు, గృహాలు, భూ సమస్యలతోపాటు పలు రకాల వినతులను ప్రజల ద్వారా ఆయన స్వీకరించారు. వీటిపై ఆయన స్పందిస్తూ ఆయా సమస్యలకు సంబంధిత అధికారులతో తక్షణమే మాట్లాడుతూ కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

### -పిజిఆర్ఎస్ కు అందిన 98 అర్జీలు -సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక



పార్వతీపురం, మార్చి 24, మేజర్ న్యూస్ :

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జేసీ అధ్యక్షతన సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, కెఆర్ఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మ చంద్రారెడ్డిలతో కలిసి 98 మంది అర్జీదారుల నుంచి జేసీ వినతులను స్వీకరించారు. కార్యక్రమం అనంతరం జేసీ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా అందిన అర్జీలకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చి పరిష్కరించాలని అన్నారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా పరిష్కారం అయ్యేలా చూడాలని తేల్చిచెప్పారు. ఎటువంటి అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలని అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలైన పాలకొండ మండలంకి చెందిన సుందరగిరి శ్రీజా భవాని తనకు టచ్ ఫోన్ కావాలని ఇదివరకు వినతి పత్రాన్ని అందజేయడంతో ఆమెకి జేసీ టచ్ ఫోన్ ను పంపిణీ చేశారు. పీజీఆర్ఎస్ లో అందిన అర్జీలలో కొన్ని...గరుగుబిల్లి మండలం రావుపల్లి ఎస్సీ కాలనీ గ్రామస్తులు జేసీకి అర్జీని అందిస్తూ తమ గృహాల మీదుగా 33 కెవి హెచ్.టి విద్యుత్ లైన్ వెళ్లిందని, తద్వారా ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయభ్రాంతులకి గురవుతున్నామని, కావున దాన్ని మార్చివేయాలని కోరారు.జియ్యమ్మవలస మండలం గడిసింగు పురం నుంచి పి.తాతబాబు తదితరులు వినతి పత్రాన్ని అందిస్తూ తమ గ్రామం లోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పనికి రాని వారి పేర్లతో అక్రమాలకు పాల్పడడమే కాకుండా, ఒక్కో వేతనదారుని నుంచి వారానికి రూ.200 చొప్పున అవినీతికి పాల్పడుతున్నారని, కావున దీనిపై సమగ్ర విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారుపార్వతీపురం మండలం డోకిశీలలోని సర్వేనెంబర్ 121,124,125 లో గల పొలాలకు ఆధారమైన పంట కాలువ పూర్తిగా కబ్జాకు గురైందని,ఆ కాలువ ద్వారా 200 ఎకరాల్లో సాగు భూములు, 15 చెరువులు ఆధారపడి ఉన్నాయని అన్నారు. కబ్జాతో చెరువులకు, పంట లకు నీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నందున బాధ్యులపై తగిన చర్యలు తీసుకొని, కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని వి.వెంకటనాయుడు జేసీకి ఫిర్యాదు చేశారు.జియ్యమ్మవలస మండలం పందులువానివలసలో గత 25 ఏళ్లుగా ఎటువంటి సౌకర్యం లేని తమ గ్రామానికి సిసి రోడ్, బస్సు షెల్టర్, స్మశానానికి రోడ్డు, వాటర్ ట్యాంక్ తదితర సదుపాయాలు సమకూర్చాలని కోరుతూ పి.చంటి,గ్రామస్తులు అర్జీని అందజేశారు.కురుపాం మండలం రెల్లిగూడ గ్రామానికి గతంలో నిర్మించిన గ్రావెల్ రోడ్డు పూర్తిగా పాడైనందున తమ గ్రామానికి అంబులెన్స్, రేషన్ వెహికల్ వంటివి రావడం లేదని, కావున కె.కొత్తగూడ జంక్షన్ - రెల్లిగూడ - జగ్గరగూడా జంక్షన్లకు రోడ్డు మంజూరుచేయాలని గ్రామ సర్పంచ్ బి.అరుణ,గ్రామస్తులు కోరుతూ దరఖాస్తును అందజేశారు.కురుపాం మండలం రెల్లిగూడ గ్రామంలో ఉన్న బోరు పూర్తిగా పాడైనందున త్రాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, కావున కొత్త బోరు మంజూరు చేయాలని, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయిలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు.పాలకొండ మండలం బుక్కురు గ్రామానికి చెందిన టి. సంధ్యా రాణి పెండింగ్ లో ఉన్న ఇంటి బిల్లును మంజూరుచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్, బి.శ్యామల, డా.ఎస్.మన్మధరావు, వి.తిరుపతయ్య, జిల్లా గ్రామీణ నీటి సరఫరా, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు ఓ.ప్రభాకర రావు, బి.చంద్రశేఖర్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.చలపతిరావు, డీఆర్డీఏ, ఐసీడీఎస్ పీడీలు సుధారాణి, డా. టి.కనకదుర్గ,మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహన రావు, డీఎస్డిఓ కె.సాయికృష్ణ చైతన్య, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ పోలీసుల ...సేవ

### -గుంతలు పూడ్చివేత ,పిచ్చి మొక్కల తొలగింపు

పార్వతీపురం రూరల్ మార్చి 24 (మేజర్ న్యూస్):



మండలానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న గుంతలను పూడుస్తూ, రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించే పనిలో రూరల్ పోలీసులు పడ్డారు. సోమవారం ఎస్సై సంతోషి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది జెసిబి సహాయంతో పిచ్చి మొక్కలను తొలగించారు. నిత్యం శాంతి భద్రతల పరిరక్షణ కాకుండా పోలీసులు సేవా కార్యక్రమాలు చేయడంతో ప్రజలు హర్షిస్తున్నారు. అనేక రహదారిలో గుంతలు ఏర్పడడంతో వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని గమనించిన ఎస్సై వాటిని పూడ్చే పనిలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. వెంకంపేట నుండి పెద బొండపల్లి, అలాగే ఎమ్మార్ నగరం నుంచి ములగ, లచ్చిరాజుపేట నుంచి పులిగుమ్మి , లచ్చిరాజుపేట నుంచి డోకి శీల గ్రామాల్లో ప్రధాన రహదారి ఇరువైపులా అనేక పిచ్చి మొక్కలు ఉండడంతో వాహన చోదకులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే పోలీసులు చేసిన ఈ సేవా కార్యక్రమం వల్ల ఎంతో మేలు జరుగుతుందని వాహన ప్రమాదాలు తగ్గుతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ శాఖ పరంగా అనేక కోడలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అంతేకాకుండా వేసవి కాలంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు కూడా ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామస్తుల సహకారము, యువకులు చొరవ చూపిస్తే ప్రతి గ్రామంలో గల కూడల్లు వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఆమె అన్నారు.

## బెట్టింగ్ లకు పాల్పడినా.. ఇతరులను ప్రోత్సహించినా.. చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం

### -పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, -జిల్లా వ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెడుతున్నాం..జిల్లా ఎస్పీ

పార్వతీపురం, మార్చి 24, మేజర్ న్యూస్ :



క్రికెట్ మ్యాచ్ లను వినోదం కోసం మాత్రమే చూడాలే తప్పా కుటుంబాలలో విషాదం నింపేలా ఉండకూడదు అని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి,పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆన్లైను బెట్టింగు యాప్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, పిలుపునిచ్చారు. ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్లు జరుగుతున్న నేపథ్యంలో ఆన్లైను, ఆఫ్లైను క్రికెట్ బెట్టింగులకు పాల్పడేవారు, ముఖ్యంగా యువత అప్రమత్తం ఉండాలని, ఆర్థికంగా జీవితాలను నాశనం చేసే బెట్టింగు యాప్ల జోలికి పోవద్దని ప్రజలును, యువతను జిల్లా ఎస్పీ హెచ్చరించారు. క్రికెట్ మ్యాచ్లు జరుగుతున్న నేపథ్యంలో వీటిని అదునుగా చేసుకొని కొందరు స్వార్ధపరులు, చెడు నడత కలిగిన వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్ లకు తెరలేపే అవకాశం ఉందన్నారు. బెట్టింగ్ లకు బలి అవుతున్నవారిలో ఎక్కువ శాతం యువతే ఉంటున్నారన్నారు. సులభంగా అధిక నగదును అర్జించవచ్చునని యువతకు ఆశ చూపుతూ బెట్టింగ్ ఊబిలో దించుతారన్నారు. ఒక్కసారి బెట్టింగ్ లకు అలవాటు పడితే వాటి నుండి బయటకు రావడం కష్టతరం అవుతుందన్నారు. బెట్టింగ్ లో ఒకసారి ఆదాయం వచ్చినా పలుమార్లు నష్ట పోవడం జరుగుతుందన్నారు. ఆ నష్టాలను భర్తీ చేసుకోవడానికి, చేసిన అప్పులను తీర్చడానికి యువత దొంగతనాలకు, ఇతర నేరాలకు పాల్పడుతూ తమ భవిష్యత్తుని అంధకారం చేసుకుంటున్నారన్నారు. బెట్టింగ్ అనేది పెనుభూతం లాంటిదని, ఆశ చూపి అధ:పాతాళానికి నెట్టేస్తుందని యువత దానికి బలికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రికెట్ బెట్టింగ్ వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి, అంతేకాకుండా క్రికెట్ బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టుకుని అనేక మంది సూసైడ్ చేసుకుంటున్నారని,క్రికెట్ మ్యాచ్ లను వినోదం కోసం మాత్రమే చూడాలని, బెట్టింగులు వైపు మొగ్గు చూపకూడదన్నారు. యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా చదువుపై, తమ ఉజ్వల భవిషత్తు పై దృష్టి సారించాలన్నారు. తమ తల్లిదండ్రుల ఆశయాల సాధన కోసం ఉన్నతంగా జీవించాలన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలన్నారు. బెట్టింగులకు పాల్పడుతుంట్లయితే వారికి నచ్చచెప్పి ఆ ఊబిలో నుండి బయటకు తీసుకురావాలన్నారు. గతంలో బెట్టింగ్ లకు పాలపడిన వారిపై, అనుమానితుల పై నిఘా ఉంచామన్నారు. . ఆన్ లైన్,ఆఫ్లైను ద్వారా బెట్టింగ్ కు పాల్పడినా, గుంపులు గుంపులుగా కూర్చుని సెల్ చూస్తూ బెట్టింగ్స్ వేస్తున్న అలాంటి వారి పై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఎవరైనా బెట్టింగులను నిర్వహించినా, అమాయకులను, యువతను బెట్టింగ్ అను ఊబిలోకి లాగాలని ప్రయత్నించినా ఉపేక్షించబోమని, నిర్వాహకులను గుర్తించి వారిపై ఆంధ్రప్రదేశ్ జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడమే కాక కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అవసరం మేరకు సస్పెక్ట్ సీట్లు ఓపెన్ చేయడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ లు జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 112/100 కు, సంబంధిత పోలీస్ అధికారులకు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ తెలిపారు.

## అంగన్వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తు: సిడిపిఓ

పార్వతీపురం రూరల్ మార్చి 24 ( మేజర్ న్యూస్):



ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్నా రెండు అంగన్వాడి సహాయక పోస్టులకు సంబంధించి ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఓ శ్రీనివాసరావు తెలిపారు.మున్సిపాలిటీ పరిధిలోగల రెల్లి వీధి 25వ వార్డు-1లో (ఎస్సీ) , 4వ వార్డు-1లో (బీసీ-డి) కి అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులు ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు నిర్దేశించిన కమ్యూనల్ రోస్టర్ రిజిస్టర్ అనుసరించి, కేటగిరీ అభ్యర్థులతో పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ పోస్టులకు 2024 జూలై 1వ తేదీ నాటికి 21-35 సం.ల మధ్య వయసు ఉండి 7/10వ తరగతి ఉత్తీర్ణులై, స్థానికంగా గల వివాహిత మహిళా అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని అన్నారు. అర్హత ఆసక్తి కలవారు ఈ నెల 31వ తేదీలోగా కార్యాలయంలోకి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఇంటర్వ్యూ తేదీ, స్థలం తెలియజేస్తామని అన్నారు. నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తుదారులకు మాత్రమే ఇంటర్వ్యూకు పిలవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## పెద్దూరు కాలనీలో విద్యుత్తు, త్రాగునీటి కష్టాలు

### -విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయక పోవడంతో ఇల్లు నిర్మాణాల్లో జాప్యం- విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసేందుకు పట్టించుకోని అధికారులు -కాలనీలో నిర్మాణం చేపట్టని పక్కాకాలువలు,సిమెంట్ రహదారులు-ఇల్లు నిర్మాణాలు చేపడుతున్న వారికి తప్పని ఇబ్బందులు-గృహ నిర్మాణశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి -తక్షణమే కాలనీలో త్రాగునీటి సౌకర్యం కల్పించాలి

గరుగుబిల్లి, మార్చి 24,మేజర్ న్యూస్:



మండలంలోని పెద్దూరు గ్రామపంచాయతీ పరిధిలోని నిర్మాణం చేపడుతున్న కాలనీలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయక పోవడంతో కాలనీలో ప్రస్తుతం ఇల్లు నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌవుతున్నారు. దీంతో కోరి కష్టాలు తెచ్చుకోవడం ఎందుకని ఇళ్ళు నిర్మాణాలు చేపట్టేం దుకు పలువురు లబ్దిదారులు ముందుకు రావడం లేదు.కాలనీలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇల్లు నిర్మాణాలకు సంబంధించి తీవ్ర జాప్యం జరుగుతోంది.పెద్దూరు గ్రామంలో పక్కా గృహాలకు అర్హులైన వారికి గ్రామం సమీపంలో సంబంధిత రెవెన్యూ అధికారులు ఇంటి స్థలాల ను మంజూరు చేశారు. ఇంటి స్థలాలు సంబంధిత లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ అధికారులు కేటాయించిన అనంతరం పలువురు ఇల్లు నిర్మాణాలను ప్రారంభించారు. ప్రస్తుతం నాలుగు నుంచి ఐదు వరకు ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే కాలనీలో కనీస సౌకర్యాలు విద్యుత్ సౌకర్యం, పక్కా కాలువలు, సిమెంట్ రహదారులతో పాటు త్రాగు నీటి సౌకర్యం లేకపోవడంతో పలు వురు ఇల్లు నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రావడం లేదని పేర్కొం టున్నారు.కాలనీలో కనీస సౌక ర్యాలు లేకపోతే ఇల్లు నిర్మాణాలు ఎలా చేపడతామని అంటున్నారు. ప్రస్తుతం ఇల్లు నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు ఇంట్లో దిగి నివాసం ఉంటున్నారు.ప్రస్తుతం పలువురు నివాసం ఉంటున్న వారు విద్యుత్తు త్రాగునీటి సౌకర్యం లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.నిర్మాణాలు పూర్తి చేసుకున్న పలువురు ఇంటిలో ఎందుకు దిగామా అని అంటున్నా రు.ఇప్పటికైనా సంబంధిత అధి కారులు పట్టించుకుని పెద్దూరు కాలనీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తు న్నారు.

## రోడ్డుకి ఇరువైపులు ఉన్న డొంకలు తుప్పలు తొలగించిన పోలీస్ సిబ్బంది .



సీతానగరం మార్చి 24 మేజర్ న్యూస్.

పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలను నివారించే కార్యక్రమంలో భాగంగా సీతానగరం ఎస్సై ఎం రాజేష్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరావు దగ్గరుండి జెసిబి సహాయంతో చినబోగిల నుండి. అప్పయ్యపేట గ్రామాల వరకు రోడ్డుకి ఇరువైపులా రోడ్డు కనిపించకుండా కప్పివేసి ఉన్న డొంకలు తుప్పలను తొలగించి వాహనదారులకు ఎదురుగా వాహనాలు క్లియర్ గా కనిపించే విధంగా చేయడం జరిగింది.

## క్షయ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి .డాక్టర్ టి. జగన్ మోహనరావు.

సీతానగరం,మార్చి24 మేజర్ న్యూస్:




క్షయ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సీతానగరం పిహెచ్సీ పరిధిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో సోమవారం ఆయన పాల్గొన్నారు.పిహెచ్సీ నుండి స్థానిక హనుమాన్ జంక్షన్ వరకు స్లోగన్స్ తో ర్యాలీ కొనసాగింది. ఈ అవగాహన కార్యక్రమంలో డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ క్షయ లక్షణాల ద్వారా వ్యాధిని శులభంగా గుర్తించవచ్చని రెండు వారాలు మించి దగ్గు,కఫం,జ్వరం,బరువు తగ్గడం,ఆకలి మందగించటం, ఉమ్మిలో రక్తం పడటం ఉంటాయరన్నారు.వ్యాధి గ్రస్తుని దగ్గు,తుమ్ముల ద్వారా వ్యాప్తి చెందుతాయన్నారు.ఆరోగ్య కేంద్రాల్లో కఫం పరీక్షల ద్వారా టిబి నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు.అలాగే ఎక్స్ రే,ఆర్టీపీసీఆర్,సిబినాట్ పరీక్షలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయన్నారు.ఆరు నెలలు ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు, పౌష్టికాహారం కొరకు నెలకు వెయ్యి చొప్పున ఆరు నెలలు వ్యాధి గ్రస్తుని ఖాతా లో ప్రభుత్వం ద్వారా జమ అవుతాయన్నారు.ప్రధాన్ మంత్రి టిబి ముక్త భారత్ అభియాన్ క్రింద వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ మిత్ర దాతల ద్వారా పోషకాహారం అందిస్తున్నారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది వ్యాధి లక్షణాలు సకాలంలో గుర్తించాలని,టిబి వ్యాదుగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వేసుకునేలా పర్యవేక్షించాలని సూచించారు.జిల్లా యంత్రాంగం,వైద్యారోగ్యశాఖ టిబి నివారణకు కృషి చేస్తుందని అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా. ఉషారాణి,డా. పావని,ఆయుష్ వైద్యాధికారి డా. హేమాక్షి,హెల్త్ సూపర్వైజర్స్ సత్యవతి,భవాని,శర్మ,వైద్య సిబ్బంది,పోలీస్ సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వెహికల్ ఫిట్నెస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి ఎమ్మెల్యే విజయ్ చంద్ర

సీతానగరం మార్చి 24 మేజర్ న్యూస్.....



మండలం చినబోగిలలో వెహికల్ ఫిట్నెస్ సెంటర్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర కోరారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే విజయ్ చంద్ర ప్రారంభించారు. పార్వతీపురం మన్యం జిల్లాకు ప్రత్యేకంగా ఈ కేంద్రం చినభోగిలలో మంజూరు అయిందన్నారు. జిల్లాలోని అన్ని రకాల వాహన యజమానులు తమ వాహనాలను ఇక్కడకు తీసుకువచ్చి ప్రభుత్వ నిర్దేశించిన రుసుంను చెల్లించి ధృవపత్రాలు పొందేందుకు ఇక్కడ వెసులుబాటు కల్పించిందన్నారు. ఆర్టీవో కార్యాలయం ఇకనుంచి వెళ్లకుండా అక్కడ ఆ శాఖ అందించే సేవలన్నీ ఇక్కడ పొందవచ్చని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరసన ర్యాలీని జయప్రదం చేయండి -యుటిఎఫ్

సీతానగరం మార్చి 24 మేజర్ న్యూస్:



పాఠశాలల అసంబద్ధ విలీనీకరణకు వ్యతిరేకంగా "మన ఊరు బడిని కాపాడుకుందాం" అనే నినాదంతో యుటిఎఫ్ మన్యం జిల్లా శాఖ రేపటి రోజున అనగా మార్చి 25న పార్వతీపురం జిల్లా కేంద్రంలో తలపెట్టిన నిరసన ర్యాలీలో జిల్లాలోని అన్ని మండలాలలోని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొనుచున్నారు కావున సీతానగరం మండల ఉపాధ్యాయులందరూ దీనిలో పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని యుటిఎఫ్ మండల శాఖ మండల ఉపాధ్యాయులను కోరింది. సీతానగరంలో సమావేశమైన యుటిఎఫ్ మండల కార్యవర్గం 3,4,5 తరగతులను సమీప పాఠశాలల్లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే ప్రభుత్వ చర్యలను అడ్డుకుంటామని తీర్మానించింది. ఈ సమావేశంలో మండల శాఖ అధ్యక్షప్రధాన కార్యదర్శులు పి. శ్రీనివాసరావు, బి. ప్రసాదరావు, ఉపాధ్యక్షులు ఏ. పోలినాయుడు, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి. ఆదినారాయణ, ఎం గోవిందరావు జె. సింహాచలం పాల్గొన్నారు

## ఫ్లెక్సీల విషయంలో రాజకీయ బురద చల్లడం తగదు




పూసపాటిరేగ, మార్చి 24, మేజర్ న్యూస్ :

అతిసార బాధితులకు గుర్ల లో నిర్వహించే ఎమ్మెల్యే చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఫ్లెక్సీలో చిన్న పొరపాటును భూతద్దంలో చూడడం తగదని జనసేన నాయకులు కోట్ల రఘు, బాల అప్పలరాజు విస్మయం వ్యక్తం చేశారు. ప్రతిసారి బాధితులకు ఎమ్మెల్యే నిర్వహించే చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గుర్ల మండలం తో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా 250 ఫ్లెక్సీలు వేయడం జరిగిందని, పొరపాటున ఓ ఫ్లెక్సీలో ఫ్లెక్సీ నిర్వాహకులు అధినేత ఫోటో వేయడం మరిచారని, దీన్నే అలుసుగా తీసుకొని కొందరు తమ ప్రతిష్టను దిగజార్చే విధంగా బురద జల్లడం తగదన్నారు. అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల పిఠాపురంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు జిల్లా నుంచి 200 పైగా కార్లను ఏర్పాటు చేయడమే కాకుండా వేలాదిమంది జనసైనికులను తరలించిన విషయాన్ని గుర్తు చేసుకోవాల్సిన విషయం అవగతం చేసుకోవాలన్నారు. అటువంటి అభిమాన నేతకు ఫ్లెక్సీ నిర్వాహకుడు చేసిన చిన్నపాటి పొరపాటుకు రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసం అంటూ ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

## ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి మనం అందరం ఏకాభిప్రాయంతో సహకరించాలి. ఎమ్మెల్యే కోళ్ల

### -మీకు గతంలో ఏ విధంగా సహకారం అందించాను ఇప్పుడు మీ భూములు విషయం లో కూడా అలాగే సహకారమందిస్తా




కొత్తవలస మార్చి 24 మేజర్ న్యూస్.

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు మనమందరం సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే కోళ్ల అన్నారు. మండలంలోని అప్పన్నదొరపాలెం గిరిజన గ్రామంలో తాసిల్దార్ నీలకంఠరావు ఆధ్వర్యంలో అధికారులతో కలిసి గ్రామసభ నిర్వహించారు ఈ కార్యక్రమనికి ఎస్.కోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి మరియు ఆర్డీవో దాట్ల కీర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల మాట్లాడుతూ "మీకు గతంలో నేను ఏ విధంగా మీ వెన్నంటే ఉండి సహాయ సహకారాలు అందించాను ఇప్పుడు మీ భూములు విషయంలో కూడా ఆ విధంగానే సహాయ సహకారాలు అందిస్తా నని మీ వెన్నంటే ఉంటానని అని అన్నారు... మీ యొక్క ప్రతిపాదన మాకు ఇస్తే మేము ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దగ్గరికి మాతో పాటు మిమ్మల్ని కూడా తీసుకుని వెళ్లి మీయొక్క డిమాండ్స్ ని తెలియజేద్దాం అని అన్నారు... ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి మనం అందరం ఏకాభిప్రాయంతో సహకరించుకొంటేనే మన ప్రాంతాలు మరియు మన కుటుంబాలు బాగుంటాయని, రాజకీయాలు అనేవి శాశ్వతం కాదని మన ప్రాంత అభివృద్ధిని మాత్రమే శాశ్వతమని తెలిపారు అయితే గ్రామంలోని యువత .కాస్త గందరగోళంగా జరిగినప్పటికీ చివరికి ప్రతిపాదనలో గ్రామస్తులు చెప్పిన షరతులాన్ని ఆర్డీవో దాట్ల కీర్తి సమక్షంలో గ్రామస్తులు సంతకాలు చేశారు.ఈ కార్యక్రమంలో అప్పన దొరపాలెం సర్పంచ్ జోడి రాములమ్మ, ఎంపీటీసీ ఉగ్గిన గురూజీ, గ్రామస్తులు నరసింగరావు, గిరి నాగరాజు పైడిరాజు తదితర యువత ఐదు మండలాల పోలీస్ సిబ్బంది పంచాయతీ సెక్రటరీలు వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు

## ఇల్లు ఒకటే "హెచ్ ఆర్ ఎ" లు రెండు..

### - స్పౌజ్ పాయింట్లతో బదిలీల్లో భారీ లాభం. - నష్టపోతున్న నాన్ పౌజ్ ఎంప్లాయిస్.




నరసన్నపేట మార్చి 24 మేజర్ న్యూస్ :

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం జీతభత్యాలతో పాటు ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్ఆర్ఏ) చెల్లిస్తుంది. ఒక కుటుంబం మొత్తం నివసించే ఇంటికి నెలకి ఒకే అద్దె ఉంటుంది. వారి స్థాయిని బట్టి అద్దె ఇళ్లలో నివాసం ఉంటారు. ఒక కుటుంబంలో ఎంతమంది ఉద్యోగులు ఉన్న అంతమందికీ హౌస్ రెంట్ అలవెన్స్ ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఇది ఒక ఎత్తు అయితే రెండు హెచ్ఆర్ఏలు పొందే భార్యాభర్తలకు బదిలీలలో ప్రయోజనం పొందే అదనపు స్పౌజ్ పాయింట్లు కేటాయింపుతో సింగిల్ స్పౌజ్ నష్టపోతున్నారనే ది జగమెరిగిన సత్యం. దూరప్రాంతాల్లో పనిచేయవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆ ఉద్యోగులందరూ రాష్ట్ర ప్రభుత్వానికి తమ మొర వినిపించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం వీటిని పట్టించుకోకపోవడంతో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పౌజ్ క్యాటగిరీలో బదిలీలు పొందిన ఉపాధ్యాయులు 8 సంవత్సరాల లోగా వాటిని ఉపయోగించుకునేందుకు వీలు లేకపోయినా ఇద్దరూ భార్య, భర్త ఉపయోగించుకున్న సంఘటన అనేకము, దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలంటూ విద్యాశాఖామాత్రికి విన్నపాలు చేస్తున్నారు. అయ్యా! మేము విద్యా శాఖ లో పని చేసే సింగల్ ఎంప్లాయ్ ఉపాధ్యాయులం. సింగల్ ఎంప్లాయ్ అనగా భర్త %౦% భార్యలలో ఒకరికి మాత్రమే ఉద్యోగం ఉన్నవారు. స్పౌజ్ ఎంప్లాయ్ ఉపాధ్యాయులు 2 హెచ్ఆర్ఏలు , తీసుకొని ట్రాన్స్ఫర్స్ లో 5 పాయింట్స్ పొందుతున్నారు. ట్రాన్స్ఫర్స్ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు సింగల్ టీచర్స్ ఎంప్లాయిస్, స్పెషల్ పాయింట్స్ లేక 3,4 కేటగిరి లో దూర ప్రాంతాలలో పని చేస్తూ ఆర్థికంగా, మానసికంగా, శారీరికంగా తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నాం. అదేవిధంగా ప్రిఫరెన్షియల్ కేటగిరి లోనే వారికి కూడా పాయింట్లు మాత్రమే ఇవ్వవలెను. లేని ఎడల ఈ స్పౌజ్ మరియు ప్రిఫరెన్షియల్ కేటగిరి వారు మాత్రమే 1,2 కేటగిరి లో ఉంటున్నారు .కావున మాపై దయ ఉంచి ఈ వివక్షత తొలగించి సమ న్యాయం చేయాలని కోరుకుంటూ.. ఇట్లు సింగల్ టీచర్స్ ఎంప్లాయిస్.

## కూటమి ప్రభుత్వంపై విమర్శలు తగవు

### -విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు



ఆమదాలవలస, మార్చి 24, మేజర్ న్యూస్

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పై వైకాపా నియోజవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ విమర్శలు చేయడం తగదని నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల డిల్లేశ్వరరావు అన్నారు. ఆమదాలవలస పట్టణంలో టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన అవినీతి చింతాడ రవికుమార్ కు గుర్తుకు రావటం లేదా అని ప్రశ్నించారు. నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్ పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే టిడిపి కార్యకర్తలు ఎవరు సహించరని అన్నారు. టిడిపి హయాంలో ఉచిత ఇసుక విధాన%శీ% రాష్ట్రం మొత్తం మీద ఉందని ఇసుక కావలసినవారు ఉచితంగా తీసుకొని వెళుతున్నారని దీనిలో ఎమ్మెల్యే కూన రవికుమార్ కు ఏమి సంబంధం అని ప్రశ్నించారు. గత వైకాపా హయాంలో జరిగిన ఇసుక అక్రమ దందా గురించి మీకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు మాట్లాడుతూ గత వైకాపా హయా%శీ% లో టిడిపి సానుభూతిపరులను ఉద్యోగాల నుంచి తొలగించారని, అలాగే చాలా మందిని చిన్న చిన్న కార్మికులను ఉపాధి లేకుండా చేసిన ఘనత మీ వైకాపా హయాములోనేనని మండిపడ్డారు. మీ వైకాపా హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలు మీకు గుర్తుకు రావటం లేదా ప్రశ్నించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ నిధులు తెచ్చి నియోజకవర్గం అభివృద్ధి పదములో నడుపుతున్నారని అలాంటి వ్యక్తిపై నిరాధారణమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు సంపదరావు మురళి, టిడిపి నాయకులు బోర గోవిందరావు, బివి రమణమూర్తి, కూన సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయం వార్షికోత్సం లో గోగుల అన్నసంతర్పణ.




కొత్తూరు మార్చి 24, మేజర్ న్యూస్

కొత్తూరు మండలం కుంటిభద్ర లక్ష్మీగణపతి ఆలయం ద్వితీయ వార్షికోత్సం మండల పరిషత్ మాజీ అధ్యక్షులు స్వర్గీయ గోగుల చల్లం నాయుడు తనయుడు వర ప్రసాదరావు నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముగింపు రోజున ఆలయ ధర్మ కర్త గోగుల మాధవి, ఆమె భర్త వర ప్రసాద రావు నాయుడు స్వామి వారికి ప్రత్యేక పూజలు, స్వామి వారి కళ్యాణం, శాస్త్రోక్తం గా నిర్వహించారు.వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం గోగుల ప్రసాదరావు నాయుడు నిర్వహించిన అన్న ప్రసాద కార్యక్రమానికి పెద్ద సంఖ్య లో హాజరై భక్తులు స్వీకరించారు.

## సైనిక నగర్ సమస్యలను పరిష్కరించండి అంటూ ఆర్డిఓ కి వినతి




టెక్కలిమార్చి 24, మేజర్ న్యూస్

ప్రజలు సమస్యలను తీర్చి, మౌలిక సదుపాయాలను కల్పించండి అంటూ బిజెపి నాయకులు ఆర్డీవోకు కోరారు. మండలంలో తొలుసూరిపల్లి పంచాయతీ సైనిక్ నగర్ లో కొన్ని ఏళ్ల నుండి కాలువలు, రహదారులు, పారిశుద్ధ్యం, జల్ జీవన మిషన్ ద్వారా ఇంటింటికి కులాయిలు, మొదలగు సమస్యల పైన ఆర్డీవో నీ ప్రజా దర్బార్లో కలసి బిజెపి నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టెక్కలి మండల అధ్యక్షులు జర్జాన రాంజీ ఆర్డీవో తో మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఆ నగరంలో త్రాగడానికి మంచినీరు వీధి కొళాయిలు, రహదారులు, కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు పెరిగి వాటిలోనా పందులు, కుక్కలు, విషసర్పాలు, క్రిమి కీటకాలు, దోమలతో అనేక ఇబ్బందులు పడుతూ ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా అక్కడ సమస్యలు మాత్రం ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదని ఆర్డిఓ కి వివరించారు. ఇప్పటికైనా వివిధ పనుల కోసం కూటమి ప్రభుత్వం కేటాయించిన నిధుల ద్వారా సైనిక నగర్ లో ఉన్న సమస్యలను తీర్చాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఆ ప్రాంతాన్ని ఒకసారి పరిశీలించి అక్కడ ప్రజలు పడుతున్న సమస్యలు గురించి తెలుసుకొని వెంటనే సమస్యలు తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చ జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి, ఎస్టీ మోర్చ జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు , నందిగామ మండల అధ్యక్షులు ఏదురు కామరాజు, టెక్కలి మండలం ప్రధాన కార్యదర్శి శాసనపురి శ్రీను, యువ మోర్చా సీనియర్ నాయకులు రాజ్ కుమార్ రెడ్డి , గోపి, అప్పన మేస్త్రి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లాస్ లో తప్పులకు బాధ్యులెవరు.

-పరీక్ష ఉందని కొన్నిచోట్ల అభ్యాసకులకే తెలియని వైనం.-లక్షల్లో నిధులు దుర్వినియోగం. ఫలితం శూన్యం. -బాధ్యులపై చర్యల కోసం డిమాండ్.-టేక్ ఇట్ ఈజీగా తీసుకున్న ప్రోగ్రామింగ్ అధికారిని.-పరీక్ష నిర్వహణ అధికారికి జిల్లా అధికారి అండ,దండలు. -నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు డిమాండ్.-ఉల్లాస్ అవకతవకలపై ఆర్ టి ఐ అప్లై చేసేందుకు సమాయత్తం.!



**మెరకముడిదాం మార్చి 24 మేజర్ న్యూస్.**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉల్లాస్ కార్యక్రమము మెరకముడిదాం మండలంలో కాగితాలకే పరిమితమైంది. తప్ప క్షేత్రస్థాయిలో మచ్చుకైనా కనబడలేదు. ప్రభుత్వ నిధులు వెచ్చించి, నిరక్షరాస్యులకు ఈనెల 23వ తేదీన నిర్వహించిన ఉల్లాస్ పరీక్ష సంబధిత అధికారుల ఉదాసీనతకు , ప్రోగ్రామింగ్ అధికారి నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది. ఈ కార్యక్రమం నిమిత్తం ప్రభుత్వం వెచ్చించిన ప్రతి రూపాయి వృధాకు ప్రతీకగా నిలిచిపోయింది. ఉల్లాస్ ప్రోగ్రామింగ్ అధికారిగా ఉన్న వెలుగు ఏపిఎం చెబుతున్న లెక్కల ప్రకారం 44 సెంటర్లు లో 1755 మంది అభ్యాసకులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలియ వచ్చింది. ఇదంతా తప్పుడు లెక్కలుగా విమర్శకులు కొట్టి పారేస్తున్నారు. అసలు ఈ పరీక్ష ఒకటుందని సగం మంది అభ్యాసకులకు తెలియనే తెలియదని బహిరంగ విమర్శలు వస్తున్నాయి. అలాంటప్పుడు వాలంటీర్లు ఎవరికి చదువు చెప్పారు. 23 న జరిగిన పరీక్షకు ఎవరిని హాజరు పరిచారు.పరీక్షలు ఎవరు రాశారు. ఇవన్నీ భేతాళ ప్రశ్నలే. వీటన్నిటికీ స్వస్తి పలకాలంటే ఉల్లాస్ పై సమగ్ర విచారణ చేపట్ట వలసిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ తతంగం అంతా మండల ప్రోగ్రామింగ్ అధికారి వారికి, పై అధికారులకు తెలిసే జరిగిందని ఆరోపణలు కూడా ఉన్నాయి. అందుకే చర్యలకు వెనుకాడుతున్నారని ఆరోపనులు వస్తున్నాయి. ఈ ఉల్లాస్ పరీక్షను అంతా ఇన్విజిలేటర్లు స్వదస్తూరుతోనే పరీక్షలు రాసినట్లు ఆరోపణలతో కూడిన ఆధారాలు ఉన్నా, అధికారులు బుకాయిస్తున్నారు. అక్కడక్కడ కొంత శాతం పరీక్షను అభ్యాసకులు రాసిన మేజర్ పార్ట్ ఇన్విజిలేటర్లే పరీక్షను రాసి మ మ అనిపించారు. ఇంకో విచిత్రం ఏమిటంటే ఇన్విజిలెటర్లు వారి తప్పును కప్పిపుచ్చుకోవడానికి పరీక్షను ఎడమ చేతితోనూ, కుడి చేతితోనూ మార్చి, మార్చి తిప్పి,తిప్పి పరీక్ష రాసిన వైనం వెలుగులోకి వచ్చింది. దీంతో ప్రభుత్వ ఆశయం నెరవేరక, ఉల్లాస్ అబాసు పాలయిందని విమర్శలు గుప్పమంటున్నాయి. మేజర్ న్యూస్ లో వచ్చిన కథనాలుకు ఒక అధికారి స్పందిస్తూ, ఇలాంటివి జరగడం సహజమే, ఇందులో తప్పేముంది, సరిపెట్టుకోవాలని ఆ అధికారి అనడం గర్హనీయం. దీన్ని బట్టి చూస్తే పై అధికారులు కూడా ప్రోగ్రామింగ్ అధికారి కి ఎలా వత్తాసు పలుకుతున్నారో అర్థమై పోతుంది. ఈ విమర్శలను సంబంధిత అధికారులు దృష్టికి వెళ్ళినా టేక్ టీజీగా తీసుకోవడం గమనార్హం. దీనిపై చర్యలు తీసుకోకుంటే ముమ్మందు ప్రభుత్వం మరిన్ని ప్రయోజన కార్యక్రమాలు కు నిధులు వెచ్చించినా నిష్ప్రయోజనం అయ్యే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా ప్రభుత్వ పథకాల ను నీరుగార్చిన అధికారిపై చర్యలు తీసుకునేందుకు కొందరు ప్రజా ప్రతినిధులు ఆర్ టి ఐ ద్వారా సమాచారం పొంది పోరాటంకు సిద్ధమవుతున్నారు. ఆర్ టి ఐ ద్వారా వచ్చిన సమాచారంతో అసలు లెక్కలు తేలే అవకాశం ఉన్నందున, ఇక ఉల్లాస్ లో జరిగిన అవకతవకలపై పూర్తి సమాచారం లిఖిత పూర్వకంగా పొందుటకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయుటకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికైనా ఉల్లాస్ పై వచ్చిన ఆరోపణలపై జిల్లా అదికారులు స్పందించి, సమగ్ర దర్యాప్తు చేయించి భాధ్యుల పై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు.

# మస్తర్ల విషయంలో అన్యాయం జరిగిందంటూ కూలీల ఆందోళన

## -ఎంపీడీవో ను ఆశ్రయించిన కూలీలు

**పూసపాటిరేగ, మార్చి 24, మేజర్ న్యూస్:**



మండలంలోని పెద్ద బత్తివలసకు చెందిన ఉపాధి హామీ పథకం కూలీలు తమ శ్రమను దోచుకొని పనికి తగ్గ వేతనం అందడం లేదంటూ ఎంపీడీవో రాధిక వద్ద సోమవారం తమగోడును వెల్లబోసుకున్నారు. తమ గ్రామ సమీపంలో ఉన్న చెరువుల్లో ఫారం పాండ్ల తవ్వకాలు నిర్వహించినప్పటికీ ఆరు రోజుల మస్తర్లకు మూడు రోజులు మాత్రమే వేతనంగా రికార్డు చేయడం వలన తమకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ కూలీలంతా మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఎంపీడీవో రాధికను ఆశ్రయించి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. అంతేకాకుండా పథకం సాంకేతిక అధికారిని సుమతి పరుష పదజాలంతో తమను తిట్టడమే కాకుండా తమకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే చీదరించుకుంటున్నారంటూ సాంకేతిక అధికారిని సుమతి తీరును తప్పుపడుతూ ఎంపీడీవోకి వివరించారు. దీనితో పథకం సిబ్బందిని కార్యాలయానికి రప్పించి కూలీలకు అన్యాయం జరగకుండా మరోసారి కొలతలు వేసి సరి చేయాలంటూ పథకం సిబ్బందికి ఎంపీడీవో రాధిక దిశా నిర్దేశం చేశారు.

# ఐ సి డి యస్ ఆధ్వర్యంలో పోషణ్ భీ పడాయి భీ శిక్షణ

## -సూపర్ వైజర్లు శ్రీదేవి, లక్ష్మి, నాగమణి వెల్లడి.!

**మెరకముడిదాం మార్చి 24 మేజర్ న్యూస్.**

మండలంలో గల గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మూడు రోజుల పాటు పోషణ భీ పడాయి భీ పథకం పై శిక్షణా కార్యక్రమం ఉంటుందని ఐ సి డి యస్ సూపర్ వైజర్లు టి. శ్రీదేవి జె.లక్ష్మి, యం. నాగమణి లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ భీ పడాయి భీ పథకముపై శిక్షణా కార్యక్రమాలు ఈ నెల 25,26,27 తేదీలలో చీపురుపల్లి ఐ సి డి యస్ ప్రాజెక్టు అధికారిని యం.రాజేశ్వరి ఆధ్యర్యంలో జరుగుతాయని మండల సూపర్ వైజర్లు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# నియోజకవర్గంలో జనసేనకు అపూర్వ ఆదరణ

## -బచ్చన్నపేటలో 30 కుటుంబాలు వైసిపిని వీడి జనసేనలో చేరిక- నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి



**నెల్లిమర్ల, మార్చి 23, మేజర్ న్యూస్:**

నెల్లిమర్ల నియోజకవర్గంలో జనసేనకు రోజు రోజుకి అపూర్వ ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి వెల్లడించారు. మండలంలోని బొప్పడాం పంచాయతీ పరిధి బుచ్చన్నపేటలో 30 కుటుంబాలు వైసిపిని వీడి జనసేన తీర్థం పుచ్చుకున్నాయి. భోగాపురం మండలం ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే నాగమాధవి సోమవారం జనసేన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ వైసిపిలో దౌర్జన్యాయాలు, అక్రమాలు, ప్రజా సమస్యలు గాలికొదిలేయడం వంటి తదితర కారణాలు వల్ల వైసిపిని వీడి జనసేనలో చేరుతున్నారని చెప్పారు. డిప్యూటీ సిఎం పవన్ నాయకత్వంపై నమ్మకంతో పార్టీ సిద్ధాంతాలు నమ్మి జనసేనలో చేరుతున్నామని పార్టీలో చేరినవారు చెప్పారు. ఎమ్మెల్యే మాధవి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోరాడ రమేష్, కరుమజ్జి గోవింద్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 25,26 తేదీల్లో ఏపిపిఎస్‌సి పరీక్షలు

## -సెల్ ఫోన్లుకు అనుమతి లేదు -జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి



**విజయనగరం బ్యూరో, మార్చి 24 , మేజర్ న్యూస్ :**

ఈ నెల 25,26 తేదీల్లో జరగనున్న ఏపిపిఎస్‌సి పరీక్షలకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై తమ ఛాంబర్‌లో సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 25న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, 25,26 తేదీల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అనలిస్ట్ గ్రేడ్-2 ఉద్యోగాలకు, 26న డిప్యుటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఎపిపిఎస్‌సి ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించనుందని తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12 గంటలు వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటలు వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. జిల్లాలో ఎంవిజిఆర్ కళాశాల, అయాన్ డిజిటల్, లెండి ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులను ఉదయం 8 నుంచి 9 గంటలు వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటలు వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. వారు హాల్ టిక్కెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును కూడా తప్పనిసరిగా తీసుకురావాలి చెప్పారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వాచీలు, పరికరాలను ఎట్టి పరిస్థితిలోనూ అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలవద్ద తగిన పోలీసు బందోబస్తు, వైద్య శిబిరాలు, త్రాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఛీఫ్ సూపరింటిండెంట్లదే కీలక బాధ్యత అని డిఆర్ఓ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు, పరీక్షల సూపరింటిండెంట్ భాస్కర్రావు, ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ ఎం.బాలరాజు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ కె.అనిల్ కుమార్, పోలీసు, రెవెన్యూ, వైద్యారోగ్యశాఖ ప్రతినిధులు, ఛీఫ్ సూపరింటిండెంట్లు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

# మిమ్స్ ఆస్పత్రిలో వృద్ధురాలికి అరుదైన శస్త్రచికిత్స

**నెల్లిమర్ల, మార్చి 24, మేజర్ న్యూస్:**



నెల్లిమర్ల పట్టణంలోని మిమ్స్ జనరల్ ఆస్పత్రిలో ఓ మహిళకు వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. గరివిడి మండలం కోడూరు గ్రామానికి చెందిన కొత్తింటి నారాయణమ్మ అనే 70 ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స నిమిత్తం మిమ్స్ ఆస్పత్రిలో చేరారు. వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమె క్లిష్టమైన హెర్నియాతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అత్యవసరంగా సర్జరీ అవసరమని నిర్ధారణ చేసుకున్నారు. ఆస్పత్రి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ కేసిటీ నాయక్, డాక్టర్ కృష్ణచైతన్య బొత్స ఆధ్వర్యంలో సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ ఎన్ సి ఏ నరసింహారావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కే వెంకటేశ్వరరావు తదితరులు నారాయణమ్మకు తాజాగా సర్జరీ చేపట్టారు. ఎనస్థీషియా విభాగం వైద్యులు సహకారం అందించారు. ఎంతో క్లిష్టమైన హెర్నియాకు అధునాతన పద్ధతిలో మొట్టమొదటి సారిగా శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. దీంతో సదరు మహిళ బంధువులు మిమ్స్ యాజమాన్యానికి, వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన పాలకొండ డిఎస్పి ఎం.రాంబాబు.




**గుమ్మలక్ష్మీ పురం, మార్చి 24 (మేజర్ న్యూస్).**

గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఉన్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను పాలకొండ డి.ఎస్.పి ఎం.రాంబాబు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల దగ్గర కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహించి విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను కూడా చూసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పరీక్ష కేంద్రానికి విద్యార్థులు వచ్చేటప్పుడు విద్యార్థులకు వాహన సదుపాయం లేకపోతే ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులను చేరే విధంగా మానవతా దృక్పథంతో సహాయం చేయాలని కోరారు. అదేవిధంగా మా సిబ్బందిని కూడా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇటువంటి ఇబ్బందులు కలక్కుండా పరీక్షా కేంద్రాలకి వెళ్లేటట్టు, అదేవిధంగా ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించామన్నారు.

# బాడంగిలో క్షయ వ్యాధి నిర్మూలన పై అవగాహన ర్యాలీ




**బాడంగి, మార్చి 24, మేజర్ న్యూస్:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు ఆయుష్ కమిషనర్ ఆదేశాలు మేరకు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం బాడంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఆయుష్ డాక్టర్ రెడ్డి ఉమాదేవి ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రంలో తమ తోటి వైద్యులతో మరియు వారి సహాయ సిబ్బంది తో కలిసి గ్రామ ప్రజల సహకారంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె క్షయ వ్యాధితో బాధపడుతున్న రోగులకు బాడంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యంతో పాటు ఉచితంగా ప్రభుత్వం మందులు అందిస్తుంది అని ఆమె తెలిపారు రోగం నిర్ధారణ అయితే ఆరు నుండి తొమ్మిది నెలల్లో మందులు ద్వారా నివారించవచ్చునని డాక్టర్ సలహాతో మందులు క్రమం తప్పకుండా వాడాలని క్షయ వ్యాధిగ్రస్తులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అదేవిధంగా క్షయ వ్యాధి బారినపడకుండా ఉండానికీ ఎలా జాగ్రత్తలు,ఆహార నియమాలు తీసుకోవాలో ఆమె అవగాహన కల్పించారు

# కీర్తివీధిలో శిథిల కాలువలతో ఇక్కట్లు

**నెల్లిమర్ల, మార్చి 24, మేజర్ న్యూస్:**



నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని కీర్తివీధిలో మురుగునీటి కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ వీధిలోని మొదటి లైన్లో కాలువలు పూర్తిగా పాడవ్వడంతో స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే నగర పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు కీర్తి లక్ష్మణరావు, కీర్తి ఈశ్వరరావు చెబుతున్నారు. పాములు, తేళ్లు వంటి విషపురుగులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాలువులో మురికి నీరు నిల్వుండంతో కుళాయి నీరు కలుషితమవుతోందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# గంజాయి అక్రమ రవాణాపై పూర్తి నిఘా

## -కొట్టక్కి చెకోపోస్టును ఆకస్మికంగా తనిఖీచేసిన డీఎస్పీ

**రామభద్రపురం, మేజర్ న్యూస్**



గంజాయి అక్రమ రవాణాపై పూర్తి నిఘా పెట్టామని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని కొట్టక్కి వద్ద ఏర్పాటు చేసిన చెకోపోస్టును సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, ఇప్పటికే దీనిపై జల్లెడ పడుత న్నామని తెలిపారు. గంజాయి అక్రమంగా రవాణా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ఒడిషా రాష్ట్రం నుంచి గంజాయి ఎక్కువగా రవాణా అవుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఆ దిశగా నిఘా పెట్టామని తెలిపారు. అనంతరం చెకోపోస్టు వద్ద ఉన్న రికార్డులు పరిశీలించారు. ప్రతీ రోజు ఎన్ని వాహనాలు తనిఖీ చేస్తుంది అడిగి తెలుసుకున్నారు. ఈ గంజాయి అక్రమ రవాణాలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో త నిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు.

# ఆశీల్ల వేలం పాట మళ్ళీ వాయిదా



**నెల్లిమర్ల, మార్చి 24, మేజర్ న్యూస్:**

నెల్లిమర్ల నగర పంచాయతీలో ఆశీళ్లు వసూలు చేసుకునే నిమిత్తం సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట మళ్ళీ వాయిదా పడింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం బహిరంగ వేలం పాట నిర్వహించగా ఒక్కరూ హాజరుకాలేదు. దీంతో 25వ తేదీకి మళ్ళీ వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ అప్పలరాజు తెలిపారు. ఉదయం 11.30 గంటలకు కార్యాలయంలో బహిరంగ వేలం వేస్తామని ప్రకటించారు. ఆసక్తి కలిగిన వారు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

### -రోగులకు అసౌకర్యం కలుగకుండా చూడాలి -ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు



చీపురుపల్లి మార్చి 24 మేజర్ న్యూస్:

వైద్యం కోసం వచ్చే రోగులపట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని చీపురుపల్లి శాసన సభ్యులు కిమిడి కళా వెంకటరావు హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రి సముదాయాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రంగా ఉంటే సగం రోగాలు నయమవుతాయన్నారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల విధులతో పాటు పారిశుద్ధ్యనికి సంబంధించి కూడా ప్రాముఖ్యత ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. పారిశుద్ధ్యపు పనులకు సంబంధించి కాంట్రాక్టర్ పరిశుభ్రతకు అవసరమైన వనరులు సమకూర్చుకున్నది, లేనిది సూపర్వైజర్ ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా స్థానిక పంచాయితీ కార్యదర్శులు కూడా ఎప్పటికప్పుడు ఆసుపత్రి సముదాయంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించాలని సూచించారు. పారిశుద్ధ్యంలోపిస్తే ఎంతటి వారినైనా క్షమించేది లేదని ఈ సందర్భంగా కళా వెంకట్రావు హెచ్చరించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ఆరా తీసిన ఆయన ఆసుపత్రి అభివృద్ధి పనులకు సంబంధించి అవసరాలను గుర్తించి నివేదికలు తయారు చేయాలని సూచించారు. త్వరితగతిన ఆసుపత్రి సముదాయంలో వీధి దీపాలు, రహదారులు, కాలువలు ఏర్పాటు చేయాలని ఆయన వివరించారు. అదే విధముగా రక్త నిధి కేంద్రానికి సంబంధించి విద్యుత్ అంతరాయం లేకుండా ఇన్వర్టర్ సదుపాయాన్ని ఆసుపత్రి నిధుల నుంచి కల్పించాలని ఆయన సూచించారు. ఆసుపత్రికి అవసరమైన రేడియాలజిస్ట్, ఐసీయు గదులు, ఆపరేషన్ థియేటర్లు, వీల్ చైర్ లను ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రోగులకు అవసరమైన ఆక్సిజన్ ను నిత్యం ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలన్నారు. ఆక్సిజన్ కొరతతో ఏ ఒక్కరూ మృత్యువాత పడకూడదు అన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో తమ విధులు నిర్వహిస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. వైద్యులపై నమ్మకంతో తమ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ఆసుపత్రికి చేరుకున్న రోగులకు నమ్మకం కలిగించే విధంగా వైద్యులు బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో ఆసుపత్రి వైద్యులు తిరుపతిరావు, కుమార్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కామ నాయుడు, రామచంద్రుడు, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, జనసేన పార్టీ ఇంచార్జ్ విసనగిరి శ్రీనివాసరావు, డాక్టర్ విజయసారధిరావు, ఇజ్జిరోతు రాంబాబు, రౌతు రమేష్ నాయుడు, సన్యాసప్పల నాయుడు, సనపతి శ్రీనివాసరావు, పైల బలరాం, ముల్లు రమణ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా ఆసుపత్రికి చేరుకున్న కళా వెంకట్రావు ఆసుపత్రి సముదాయంలోని అన్ని వార్డులను క్షుణ్ణంగా పరిశీలించి వైద్యుల పనితీరుపై రోగులను ప్రశ్నించి అడిగి తెలుసుకున్నారు. వార్డుల వారిగా పరిశీలించిన అనంతరం ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పై ఆసుపత్రి సూపరింటెండెంట్ సుధీర్ ని సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## క్రికెట్ బెట్టింగ్ లతో కుటుంబాలను వీధిని పడేయవద్దు

### -ఎస్ ఐ జె తారకేశ్వరరావు



బాడంగి, మార్చి 24, మేజర్ న్యూస్:

ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లు జరుగుతున్నాయని వాటిని స్పోర్టివ్ గా తీసుకోవాలని అంతేకానీ క్రికెట్ బెట్టింగ్ లు వేసి డబ్బులు పోగొట్టుకొని కుటుంబాలను వీధిని పడేయవద్దని ఎస్ ఐ జె తారకేశ్వరరావు అన్నారు ఎవరైనా బెట్టింగ్ లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగులపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఆయన చెప్పారు ఐపిఎల్ సీజన్ కావడంతో బెట్టింగులు నివారణకుపటిష్టచర్యలుతీసుకుంటున్నామన్నారు. క్రికెట్ బెట్టింగ్ వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఐపిఎల్ మ్యాచులకు బెట్టింగ్ వేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలోని అనుమానిత ప్రాంతాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తామన్నారు. బెట్టింగులు వేసి విలువైన డబ్బు, జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన కోరారు

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన తాసిల్దార్ శేఖరం.



గుమ్మలక్ష్మీపురం, మార్చి 24 (మేజర్ న్యూస్).

మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మూడు పదవ తరగతి పరీక్ష కేంద్రాలను స్థానిక తాసిల్దార్ ఎన్.శేఖరం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఇటువంటి అవాంఛనీయ సంఘటనలో తల ఎత్తకుండా ఎల్విన్ పేట సబ్ ఇన్స్పెక్టర్ బి. శివప్రసాద్ ఆధ్వర్యంలో 144 సెక్షన్ ను అమలు చేస్తున్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు ఎత్తకుండా ఉండేందుకు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లకు పేపర్ కస్టోడియన్ లకు తగు మేరకు సూచనలు చేశారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించి వైద్య పరంగా ఎటువంటి ఇబ్బందు లేకుండా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలనే అన్నారు. అలాగే పరీక్ష కేంద్రాలల్లో మాస్ కాపీయింగ్ కు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నేను వెంట ఎవరూ సిబ్బంది పరీక్ష కేంద్రాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ

### -గరుగుబిల్లి,రావివలస,పి హెచ్ సి సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ -డాక్టర్ ఎస్ సంతోష్ కుమార్,డాక్టర్ కీర్తిలు తదితరులు -పాల్గొన్న వైద్య సిబ్బంది,అంగన్వాడీ వర్కర్ లు...




గరుగుబిల్లి,మార్చి 24, మేజర్ న్యూస్:

ప్రపంచ టి బి నివారణ దినోత్సవం సందర్భంగా గరుగుబిల్లి, రావివలస,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సోమవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఆయా వీధులలో ర్యాలీని నిర్వహించారు.ఈ సంద ర్భంగా గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ టి బి వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు భాగస్వా ములు కావాల్సి ఉందని కోరారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది సర్వే చేసి టి బి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించాల న్నారు.రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కీర్తి మాట్లాడుతూ టి బి అంటు వ్యాధి అని రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పు డు, క్షయ క్రిములు గాలి ద్వారా ఇతరులకు వ్యాపిస్తాయన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, కఫం,జ్వరం వుండడం, బరువు తగ్గుట,ఆకలి మందగించడం ఉమ్మిలో రక్తం పడటం మొదలగు లక్షణా లు ద్వారా గుర్తించవచ్చు న్నారు.ఈకార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది చిన్నమ్మి , హెచ్ వి లు చింతాడ ఉదయ కుమారి, సన్యాసమ్మ, దాసరి మృత్యుంజయరావు, ఈవో ఎస్ ఎస్ ప్రకాష్ రావు,గుంట్రెడ్డి సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యపై అంగన్వాడీలకు శిక్షణ తరగతులు

### - సిడిపిఓ బొత్స అనంతలక్ష్మి,



పాచిపెంట, మార్చ్ 24, మేజర్ న్యూస్:

అంగన్వాడి కార్యకర్తలకు పూర్వ విద్యపై మూడు రోజులు పాటు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఐ సి డి ఎస్ సిడిపిఓ బొత్స అనంతలక్ష్మి తెలిపారు. పోషణ భీ పదాయి భీ లో భాగంగా మొదటిరోజు శిక్షణ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడిపిఓ బొత్స అనంతలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు చిన్నారుల బాలిక విద్య పైన మరియు ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు పాటించి శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. అంగనవాడి కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు తగు మేరకు విద్యా విషయాల పైన శ్రద్ధ వహించాలని అన్నారు. అలాగే కేంద్రాలకు వస్తున్న చిన్నారుల విషయంలో బాధ్యతతో ఉండాలని అన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలకు పోషన్ బి పదాయి బి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. మూడు రోజులపాటు అందిస్తున్న ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో బి వి జె పాత్రో, ఎంఈఓ లు టెన్త్ సత్యనారాయణ, సతీషుల తో పాటు ఐ సిడిఎస్ సిబ్బంది హాజరయ్యారు

## సి ఆర్ ఎం టి సేవలు అదుర్స్



రామభద్రపురం, మార్చ్ 24(మేజర్ న్యూస్)

మండల పరిధిలోని కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్లస్టర్ సి ఆర్ ఎం టి గా పనిచేస్తున్న బొప్పే సురేష్ మరియు రొంపల్లి జిల్లాపరిషత్ హై స్కూల్ క్లస్టర్ సి ఆర్ ఎం టి మీసాల నిర్మల ల యొక్క సేవలు అదుర్స్ అని కొట్టక్కి ప్రధానోపాధ్యాయులు డా. రావడ భాస్కరరావు రొంపల్లి క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు వేణు మాస్టర్లు అభినందించారు.నూతన విద్య సంవత్సరం మార్పులో భాగంగా రొంపల్లి ఉన్నత పాఠశాల పరిధిలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలు కొట్టక్కి క్లస్టర్ నందు చేరునందున వారి యొక్క సేవలు అమోఘం అని క్లస్టర్ హెడ్ మాస్టర్ల మరియు మండల విద్యాశాఖాధికారులు ఆమిటి తిరుముల ప్రసాద్ మరియు రేగాన పెంటయ్య లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఉపాధ్యాయులు, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు %ు% శంకరరావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ రత్న కిషోర్,పాఠశాల సిబంది పాల్గొన్నారు.

## ఉపాధిహామీపథకం సామాజికతనిఖీ ప్రజావేదిక నిర్వహణ




సీతానగరం, మార్చి 24 మేజర్ న్యూస్:

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 1ఏప్రిల్ 2023నుండి మార్చి31,2024 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చుచేసిన 28 కోట్ల49 లక్షల 91వేల 812 రూపాయలకు 17వ విడత ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఉపాధిహామీ పథకం జిల్లా పిడి కె.రామచంద్రరావు ఆధ్వర్యంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. 35 గ్రామపంచాయతీలకు చెందిన సామాజిక తనిఖీల నివేదికలను పూర్తి ఆధారాలతో ఎస్ఆర్పి మాధవరావు ఆధ్వర్యంలో డిఆర్పీలు పోతురాజు అప్పలనాయుడు రాము సతీష్ అశోక్ కుమారులు కూలంకుశంగా వివరించారు. పలు గ్రామాలకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బందికి అపరాధ రుసుమును చెల్లించాలని పిడి ఆదేశించారు. చాలా గ్రామాల్లో పనులు చోటా బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాటిని తక్షణమే ఏర్పాటు చేయాలని లేదంటే దానికి సంబంధించిన డబ్బులు జమ చేయాలని ఆదేశించారు. సామాజిక తనిఖీ సక్రమంగా జరిగిందని, పెద్దగా లోటుపాట్లు లేవని వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేస్తున్న ప్లాంటేషన్ సక్రమంగా నిర్వహించాలన్నారు. శనివారం పని దినాల నమోదులో సంతకాలు లేని అంశాన్ని గుర్తించామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో పి.త్రివిక్రమరావు, ఎంపీపీ ప్రతినిధి శ్రీరాములనాయుడు జడ్పిటిసి మామిడి బాబ్జి, టిడిపినాయకులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల నాయుడు, తేరేజమ్మ,అరవింద్, తదితర నాయకులు సర్పంచులు, ఏపీవో భాను, జేఏ తిరుమలరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజా వేదిక కార్యక్రమం సజావుగా జరగడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు ఊపిరి పీల్చుకున్నారు.

## ఏనుగులు జోన్ ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చేయాలి

### -తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిరసన కార్యక్రమం.- తహసిల్దార్ కార్యాలయం నుండి బజారు వరకు ర్యాలీ .



సీతానగరం మార్చి 24 మేజర్ న్యూస్

.అమ్మాదేవి కొండపైన ఏనుగులు జోన్ ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చెయ్యాలని కోరుతూ స్థానిక మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అప్పయ్య పేట, రేపటి వలస, తామర ఖండి, జోగంపేట, గుచ్చిమి తాన సీతారాంపురం చిన్నారాయుడిపేట, పార్వతీపురం మండలం పులుగుమ్మి, గబవలస గ్రామాల ప్రజలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు మాట్లాడుతూ సీతానగరం, పార్వతీపురం మండలాల పరిధిలోగల అమ్మా దేవి కొండ వద్ద సుమారు 10 గ్రామాలలో 1100 ఎకరాలు విస్తీర్ణంలో గల కొండ సరిహద్దుల్లో ఏనుగులు జోన్ పేరుతో ఫారెస్ట్ అధికారులు చేపట్టిన (కందకాలు )ట్రెంచ్ కటింగ్ పనులు రైతులకు ప్రజలకు తెలియజేయకుండా గ్రామ సభలు జరపకుండా మొండిగా పనులు చేపట్టారు. ఏనుగులు జోన్ ను పార్వతీపురం మన్యం జిల్లా నడిబొడ్డునగల సీతానగరం మండలంలో పెట్టడం అంటే ఇటు మండల ప్రజలు,అటు జిల్లా ప్రజలు ప్రాణాలతో చెలగాటమాడటమేనని ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఏనుగులు ఎక్కడ నుండి వచ్చాయో అక్కడికే తరలించాలని, ఈ ప్రాంతంలో కందకాలు త్రవ్వకాలుచేపట్టడం వల్ల గిరిజనులు,దళితులు, పేదలు గత 50 సంవత్సరాలుగా పెంచుకున్న తోటలో భూములు నాశనం అవుతున్నాయని, కొండ దిగున గల రైతుల భూములకు వర్షాకాలంలో గెడ్డల ద్వారా చెరువులకు నీరు చేరుతుందని, ఇప్పుడు కందకాలు తవ్వడం వలన చెరువులలోకి నీరు రాకుండా నిలిచిపోతుందని తద్వారా చెరువులు ఎండిపోతాయని, ఖరీఫ్ సీజన్లో రైతుల పంటలకు నష్టం వాటిల్లుతుందని, గిరిజనులు, దళితులు, పేదలు సాగులో వున్న భూములకు రక్షణ కల్పించాలని, ఇప్పటికే జిల్లాలో చాలామంది ఏనుగుల బారిన పడి 30 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు, రైతుల పంటలు నాశనం అయిపోతున్నాయి అయినా నష్టపరిహారం అందించట్లేదు, అటవీ శాఖ అధికారులు దౌర్జన్యంగా చేస్తున్న పనులను ఆపాలని, జనావాసాల మధ్య ఏనుగులు జోన్ ఏర్పాటు తగదని మండల ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, ఇంతవరకు ఏనుగులు కలిగిస్తున్న నష్టం ఈ ప్రాంతంలో కూడా వచ్చే ప్రమాదం ఉందని ప్రజల భయాందోళనలో ఉన్నారని, మండల ప్రజలకు కూడా ఈ ప్రమాదం పిలుపుగా ఉందని కావున తక్షణమే అధికారులు ఏనుగుల జోన్ ఆపాలని ఫ్రెంచ్ కటింగ్ పనులు నిలుపుదల చేయాలని ఈ కొండ చుట్టూ గల గ్రామాల ప్రజల రైతులకు రక్షణ కల్పించాలని కోరుతున్నమని తెలిపారు. అనంతరం మండల తాసిల్దార్ వారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు,గవర వెంకటరమణ,రెడ్డి రమణమూర్తి,బి అప్పారావు,సిహెచ్ కృష్ణ, బాధిత గ్రామాల ప్రజలు సింహాద్రి దొర, జన్ని శ్రీధర్, ఎస్,మేరమ్మ, ఎన్, వాసు,బాత శంకర రావు, ప్రసాదు, కొండపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు

## గుమ్మలక్ష్మీపురంలో అభయాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి స్థల పరిశీలన.

గుమ్మలక్ష్మీపురం, మార్చి 24 (మేజర్ న్యూస్).



గుమ్మలక్ష్మీపురం గ్రామ పంచాయతీలో గల ఆంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణానికి స్థలం చూడడం జరిగిందనీ సర్పంచులు బొత్తాడ గౌరీ శంకర్రావు తెలిపారు. ఆలయానికి సుమారుగా 10 లక్షలతో నిర్మాణం జరుగుతుందని తెలియజేశారు.హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు శ్యాంసుందర్ మన్యం జిల్లా టిటిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ వచ్చి ఆలయాన్ని పరిశీలించారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కురుపాం నియోజకవర్గ సమన్వయకర్త మల్లేష్, మరియు ఉప సర్పంచ్ కొత్తకోట కిషోర్ పాల్గొన్నారు.

# ఉల్లాస్ పరీక్షల మూల్యాంకనం పూర్తి

**-మండల వెలుగు ఏపిఎం పెదిరెడ్ల అప్పలనాయుడు వెల్లడి - మండల వెలుగు కార్యాలయ%శీ%కు చేరుకున్న పరీక్ష పేపర్లు - సి సిలు తిరుపతిరావు,రామి నాయుడు,లక్ష్మణరావు,చంద్ర మోహన్,మరియదాసు,తదితరులు**

**గరుగుబిల్లి,మార్చి24, మేజర్ న్యూస్:**



ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు నిర్వ హించిన పరీక్షలకు సంబంధించి మూల్యాంకనం పూర్తి చేశారు. మూల్యాంకనం పూర్తి అయిన నేపథ్యంలో సోమవారం ఆయా గ్రామాలకు చెందిన వెలుగు వివోఏలు మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంకు పరీక్ష పేపర్లను అందజేశారు.మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు సంబంధించి 1419 మంది అభ్యాసకులకు గాను 1338 మంది అభ్యాసకులు పరీక్షలు రాయ డం జరిగిందని మండల వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పెదిరెడ్ల అప్పలనాయుడు వెల్లడించారు. పరీక్షలను సీసీలు చందాన తిరుపతిరావు, రామినాయుడు, లక్ష్మణరావు, చంద్రమోహన్, మరియదాసు, తదితరులు పర్యవేక్షించారని పేర్కొన్నారు.

## పెద్ద కంచూరులో సామూహిక విత్తన గుళికల తయారీ



**పాచిపెంట, మార్చి 24, మేజర్ న్యూస్ :**

గిరిజన రైతులందరూ పోడు వ్యవసాయంలో పండించే తెల్ల జొన్న సజ్జలు పెసర మినుము కంది వంటి పంటల తో విత్తన గుళికలు తయారు చేసుకుని పోడులో చల్లుకుంటే చీడపీడలలేని ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు. రాయి వలస పెద్ద కంచూరు, చాపరాయి వలస గ్రామాలలో రైతులతో సామూహిక విత్తన విత్తన గుళికల తయారీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తన గుళికలు తయారుచేసి చల్లుకోవడం వలన అనేక లాభాలు ఉన్నాయని అని అన్నారు. 1. సీజన్ కోసం చూడకుండా పొడి దుక్కిలోనే చల్లుకోవచ్చు 2. కొద్దిపాటి జల్లులకే నాణ్యమైన మొలకలు వస్తాయి3. విత్తనానికి పక్షులు కీటకాలు చెదలు చీమల బెడద ఉండదు 4. విత్తన తేజం ఎక్కువగా ఉంటుంది5. ఆరోగ్యవంతమైన మొలక రావడం వలన చీడపీడల ఉధృతి తగ్గుతుంది 6. మొలకెత్తిన విత్తనం కు గుళిక నుండే పోషక సరఫరా మొదలవుతుంది.విత్తన గుళికల తయారీ పద్ధతి : ముందుగా నాణ్యమైన విత్తనాన్ని సిద్ధం చేసుకుని ఒక గోనె సంచి పై వేసి కొద్దిగా నీటిని చిలకరించి గోనే సంచెను నిరంతరం కదుపుతూ మెత్తటి క్లే పొడిని మూడు నాలుగు పొరలు వెయ్యాలి. అనంతరం ఒకటి లేదా రెండు పొరలు మెత్తటి నాణ్యమైన ఘన జీవామృతం పొడిని వేస్తూ గోనె సంచిలో విత్తనాన్ని కదుపుతూ నీటిని చిలకరిస్తూ ఉండాలి. చివరగా పిడకల బూడిద గాని లేదా ఆముదపు కర్రల బూడిద గాని మెత్తగా తయారుచేసి విత్తనాలపై చల్లుతూ నీటిని చిలకరిస్తూ 15 లేదా 20 నిమిషాల పాటు గోనిసంచెను కదుపుతూ ఉండడం వలన విత్తన గుళిక తయారవుతుంది ఈ సందర్భంగా పోడు వ్యవసాయం చేసిన రైతులందరూ కూడా విత్తన గుళిక పద్ధతిని పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు భారతి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, తిరుపతి నాయుడు, చదల రాజు, విజయ్ మరియు కుమార్ మరియు రైతులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల పని వేళల్లో మార్పులు చేయాలి.

**-జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి ఎస్ డి వి ప్రసాద్ రావు.**

**గుమ్మలక్ష్మీపురం, మార్చి 24 (మేజర్ న్యూస్).**



జిల్లాలో ఉన్న భవన నిర్మాణ రంగ కార్మికులకు పనివేళల్లో మార్పులు చేయాలని జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎస్డివి ప్రసాదరావు తెలిపారు. సోమవారం ఆయన గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ, వేసవి కాలం ఎక్కువగా ఉన్న నేపధ్యంలో భవన నిర్మాణరంగ కార్మికులు, పలు విద్యా సంస్థలు, దుకాణాలు, పరిశ్రమలు మరియు వివిధ భవన నిర్మాణ ర%శీ%గ కార్మికులు పనివేళల్లో మార్పులు చేయాలని అన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఆయా కార్మికులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదాలు జరగకుండా ఉండాలని అన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ ఎం వి శేషగిరి బాబు ఆదేశాల మేరకు జిల్లాలో పనిచేస్తున్న పలు రకాల కార్మికులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేసవి తాపానికి గురికాకుండా, మృతి చెందకుండా ఆదేశాలు జారీ చేశామని అన్నారు. ఈ వేసవి కాలంలో భవన నిర్మాణ పనులు బయట ప్రాంతంలో కాకుండా లోపలి ప్రాంతాల్లో చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే పని చేపడుతున్న ప్రదేశంలో చల్లని మజ్జిగ, మంచినీరు, నీడ వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర వాటిని ఉంచాలని అన్నారు. అలాగే కార్మికులకు డిహైడ్రేషన్ లేకుండా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈయన వెంట ఎంపీపీ కే. దీనమయ్య తదితరులు ఉన్నారు.

## దర్యాప్తు వేగవంతం చేసి అవినీతిను బయటపెట్టాలి

**పార్వతీపురం రూరల్ మార్చి 24( మేజర్ న్యూస్):**

వెలుగు ఏ పి డి వై సత్యం నాయుడు చేసిన అవినీతి పై శాఖ పరంగా దర్యాప్తు వేగవంతం చేసి జరిగిన కుంభకోణాన్ని బయట పెట్టాలని ఆదివాసి గిరిజన సంఘ నాయకులు రామస్వామి డిమాండ్ చేశారు. ఎందుకు సంబంధించి సోమవారం జరిగిన గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. అయితే గతంలోనే ఈ సంఘటనపై ఫిర్యాదు రావడంతో విచారణ అధికారిగా పాలకొండ ఐటిడిఏ పిఓ ను జిల్లా కలెక్టర్ నియమించారని, అలాగే విచారణ కూడా జరుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. దీనిపై రామస్వామి మాట్లాడుతూ ఏపీడి చేసిన అవినీతి అక్రమాలను అంతా ఇంతా కాదని, కొమరడ మండలం తో పాటు పార్వతీపురం మండలంలో అనేక కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అప్పటి ఏపిడి అవినీతికి శ్రీకారం చుట్టారని, మహిళలకు స్వయం ఉపాధి పై ఎరచూపి టైలరింగ్ యంత్రాలు ఇస్తామంటూ మోసం చేశారని మండిపడ్డారు. అంతేకాకుండా ధాన్యం కొలుగోల్లో కూడా ఆయన అవినీతికి పాల్పడ్డారని ప్రతి అంశంపై విచారణ అధికారి చెత్తశుద్ధిగా విచారణ జరిపి బాధ్యుల్ని శిక్షించాలన్నారు. లేదంటే రానున్న రోజుల్లో తీవ్రస్థాయిలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# టెండర్ దారులకు ఆహ్వానం

**సీతంపేట మార్చి 24 మేజర్ న్యూస్**

సీతంపేట, ఐటిడిఏ ఆధ్వర్యంలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) గిరిజన ప్రజల నుండి సేకరించిన అటవీ ఉత్పత్తులైన కొండచీపుర్లు, కుంకుడు కాయలు మరియు పసుపు కొమ్ములకు అడ్వాన్సు టెండర్ నిర్వహించుటకు ఆసక్తి కలిగిన టెండర్ దారులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ అడ్వాన్స్ టెండర్ కార్యక్రమాన్ని ఈనెల 26వ తేదీన ఉదయం 10:30 గంటలకు ఐటీడీఏలోని ఎస్.ఆర్ శంకరన్ మీటింగ్ హాల్లి వద్ద నిర్వహించబడునని తెలిపారు.గిరిజన ప్రజల నుండి సేకరించిన 5000 కొండచీపుర్లు, 100 క్వింటాళ్ల కుంకుడు కాయలు మరియు 100 క్వింటాళ్ల పసుపు కొమ్ములకు అడ్వాన్స్ టెండర్లు నిర్వహించబడును.కావున పై ఉత్పత్తులను కొనుగోలు చేయుటకు ఆసక్తి గల వ్యాపారులు ఈ అడ్వాన్స్ టెండర్ లో పాల్గొనవచ్చునని పీవో తెలిపారు.పూర్తి వివరాలకు సీతంపేట ఐటిడిఎలోని జీసీసీ కార్యాలయాన్ని సంప్రదించాలని పీవో తెలిపారు

## నల్లయ్యకు పిజి హెచ్ఎంగా పదోన్నతి



**సీతంపేట మార్చి 24మేజర్ న్యూస్**

సీతంపేట ఐటిడిఏ పరిధిలోని సీతంపేట బాలుర ఆశ్రమ పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నల్లయ్యకు పీజీ హెచ్ఎంగా పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా పదోన్నతి పత్రాన్ని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం అందించారు.ఈ సందర్భంగా పొల్ల బాలుర ఆశ్రమ పాఠశాలకు హెచ్ఎంగా ఆయనను నియమించడం జరిగినట్లు పీవో తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన కొద్ది కాలంలోనే 84.48 కోట్లతో అభివృద్ధి.

**-నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ బాబు.**



**నర్సీపట్నం మార్చి 24 మేజర్ న్యూస్:**

నర్సీపట్నం నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ బాబు పేర్కొన్నారుకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో రూ. 84.48 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి కొనసాగుతోంది. నెలకు పది కోట్ల చొప్పున పనులకు నిధులు కేటాయించడంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషి మరువలేనిదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పేర్కొన్నారు.నర్సీపట్నం స్పీకర్ నివాసంలో నియోజకవర్గ అభివృద్ధి అంశాలను వివరించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇది కేవలం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి మాత్రమేనని అన్నారు. ప్రభుత్వం తొలినాళ్లలో గ్రామస్థాయిలో అభివృద్ధి చేస్తామంటే ప్రత్యర్థులు హేళన చేశారన్నారు. నర్సీపట్నం నుంచి ప్రాతినిధ్యం వహించిన వ్యక్తికి స్పీకర్ పదవి ఇవ్వడం గర్వకారణమని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని, అప్పట్లో జగన్మోహనరెడ్డి నర్సీపట్నంలో చెప్పిన పనులన్నీ ఉత్సవ విగ్రహాలుగా మారాయని విమర్శించారు. సంక్షేమమే అభివృద్ధి అంటూ ఊదరగొట్టిన వారు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని పేర్కొన్నారు. నర్సీపట్నం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహణకు శాప్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, గిరిజనులు, స్థానికులకు మంచి అవకాశాలు వస్తాయని తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ చర్యలు తీసుకోవడం వల్ల గంజాయి వంటి చెడు మార్గాలకు వెళ్లే అవకాశం ఉండదని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లో గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిలో నర్సీపట్నం మూలాలు కనిపిస్తున్నాయని, దీనిపై భవిష్యత్తులో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పింఛన్లు భారీగా పెంచి సంక్షేమం దిశగా ప్రభుత్వం ముందుకు తీసుకెళుతోందని అన్నారు.మాకవరపాలెంలోని మెడికల్ కాలేజీ పనులు జీవో లేకుండానే ప్రారంభించి, మధ్యలోనే నిలిపివేశారని, నర్సీపట్నాన్ని నాశనం చేసే రాజకీయాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి కార్యక్రమాలను మండల స్థాయిలో ప్రచారం చేసేలా ప్రణాళికలు చేస్తున్నామని చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలు స్పీకర్ అయ్యన్నకు అండగా నిలిచారని, వారి కుటుంబాల్లో మంచిగా చదివిన పిల్లలకు ఆర్థిక సాయం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మెంబర్‌షిప్ 50 వేలకు పైగా నమోదై రికార్డు స్థాయికి చేరిందని వివరించారు.స్పీకర్ అయ్యన్నపాత్రుడు గారు చెత్త రాజకీయాలకు దూరంగా ఉంటారని, మాకవరపాలెంలో నాయకులు బయటకు వెళతారనే అపనమ్మకంతో క్యాంప్ నిర్వహించడం విడ్డూరమని అన్నారు. నామినేషన్లు చింపే రాజకీయాలకు నర్సీపట్నంలో స్థానం లేదని, రాబోయే నూకాంబిక అమ్మవారి జాతరకు అందరూ కలిసి ముందుకు వెళ్లాలని సూచించారు.జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రాజన వీర సూర్య చంద్ర మాట్లాడుతూ, గత ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. ఎనిమిది నెలల్లో జరిగిన అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడే కారణమని పేర్కొన్నారు.గత ప్రభుత్వంలో తాండవ గేటు మరమ్మతులు కూడా చేపట్టలేకపోయారని, ఆ సమయంలో స్పీకర్ అయ్యన్న స్వంత నిధులతో గేట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, రైతుల ధాన్యం బకాయిలు చెల్లించడమే కాకుండా కొనుగోలు కొనసాగుతుందని వివరించారు. ఆస్పత్రి అభివృద్ధికి కూడా స్పీకర్ తన వంతు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు.రాబోయే మూడు నాలుగు నెలల్లో పలు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేసిందని, నర్సీపట్నాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని అన్నారు.నీతి మాలిన రాజకీయాలకు వెళ్లకుండా నియోజకవర్గ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు.ఈ సమావేశంలో కౌన్సిలర్ ధనమిరెడ్డి మధు పాల్గొన్నారు

## ప్రజాసమస్యలు ప్రజా వేదికకు 40 వినతులు



**సీతంపేట మార్చి 24 మేజర్ న్యూస్**

ప్రజా సమస్యలు ప్రజా వేదికకు 40 వినతులు వచ్చాయి. వినతులు పై స్పందించి త్వరిత గతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని పీఓ యస్వంత కుమార్ రెడ్డి అధికారులుకు ఆదేశించారు. ఏపీఓ చిన్నబాబు డిడి అన్నదోర, ఏ పి సునీల్, సిడిపి ఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా విజ్ఞాన భారతి 43వ వార్షికోత్సవం..





**నరసన్నపేట మార్చి 24 మేజర్ న్యూస్ :**

భారతీయ విద్యా కేంద్రం వారి విజ్ఞాన భారతి పాఠశాల ఇందిరా నగర్, నరసన్నపేట పాఠశాలలో 43 వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అతిథి వి.వి. రంగనాథ్ విద్యార్థులు నైతిక విలువలు కలిగి ఉండాలని, భవిష్యత్తులో మంచి మంచి స్థానాల్లో ఉండాలని చదువుకున్న పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు.ముఖ్య వక్త పి.వి. రమణమూర్తి విద్యార్థుల పంచకోస వికాసాలలో మొదటి మూడైన అన్నమయ, ప్రాణమయ, మనోమయ వికాసానికి తల్లిదండ్రులే కారకులని, నాల్గవదైన విజ్ఞానమయ కోసానికి ఉపాధ్యాయులు, ఐదవ ఆనందమయ కోసానికి ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు కారకలని తెలియచేశారు. ఈ సాంకేతిక యుగంలో నైతికతతో కూడుకున్న విద్యను అందించే ఏకైక పాఠశాల విజ్ఞాన భారతి పాఠశాలలని, మన ప్రకృతిని మనం కాపాడుకోవాలని, స్వదేశీ వస్తువులు వాడాలని తల్లిదండ్రులకు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమం నానాజీ గాడ్గే అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. గౌరవ అతిథులుగా కరస్పాండెంట్ డాక్టర్ సురేష్ కుమార్ , డాక్టర్ పి.శంకర్రావు , డాక్టర్ చల్లా అనిల్ , డాక్టర్ నితీష్ కుమార్ పాల్గొని పిల్లలకు బహుమతి ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రబంధకారిని సభ్యులు, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ సభ్యులు, తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు

## ముగ్గురు బెల్లం వ్యాపారస్తుల పై బైండోవర్ కేసు నమోదు:

**-ఎక్సైజ్ సిఐ చిన్నం నాయుడు**



**బొబ్బిలి మార్చి 24బీ మేజర్ న్యూస్:**

బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో ముగ్గురు బెల్లం వ్యాపారస్తుల పై బైండోవర్ కేసు నమోదు చేయడం జరిగిందని ఎక్సైజ్ సిఐ చిన్నం నాయుడు అన్నారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారీకి బెల్లము అమ్మకుండా ముందస్తుగా వారిని బొబ్బిలి ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎం. శ్రీను (బొబ్బిలి తహసిల్దార్ )వారి దగ్గర సంవత్సర కాలం పాటు ఒక లక్ష రూపాయలకు బైండోవర్ చేయడం జరిగిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, పి. చిన్నం నాయుడు తెలిపారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రంను పరిశీలించిన ఎంపీడీవో పైడితల్లి

**-మండల కేంద్రంలోని పబ్లిక్ పరీక్ష కేంద్రంను పరిశీలించిన ఎంపీడీవో -పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ కు తావు లేకుండా చర్యలు చేపట్టాలి. -ఎంపీడీవో పైడితల్లి వెల్లడి**



**గరుగుబిల్లి, మార్చి24, మేజర్ న్యూస్:**

మండల కేంద్రంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ బాలికల గురు కుల పాఠశాల మరియు కళాశాల లోని పదవ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రమును మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రంలో ఎటువంటి సమ స్యలు తలెత్తకుండా ఉండేలా తగు చర్యలు చేపట్టాలని చీఫ్ సూప రి%శీ%టెండెంట్ మరియు, డిపార్ట్మెంటల్ అధికారికి ఎంపీడీవో పైడితల్లి సూచించారు.పబ్లిక్ పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్ కు తావు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇన్విజిలేటర్లకు తెలియజేశారు. పరీక్ష కేంద్రంలో ఎటువంటి ఇబ్బం దులు లేకుండా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

## ఉపాధి పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలి

-మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి వెల్లడి-పనులు జరిగే ప్రదేశంలో మంచినీటి సౌకర్యం,టెంట్ లు ఏర్పాటు చేయాలి -ముందస్తు కొలతలు ఇచ్చి వేతనదారులతో పనులు చేయించాలి -పెద్దూరులో ఉపాధి పనులు పరిశీలించిన ఎంపీడీవో పైడితల్లి



**గరుగుబిల్లి, మార్చి24, మేజర్ న్యూస్:**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారు లకు కనీస వేతనం అందాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి అన్నారు.మండల పరిధి లోని పెద్దూరు గ్రామంలో చేపడు తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం పరిశీలిం చారు. ఈసందర్భంగా పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు సంబంధించిన మస్తర్లను ఎంపీడీవో పైడితల్లి పరిశీలించిన అనంతరం తగు సూచనలు సలహాలు అంద జేశారు. అనంతరం ఎంపీడీవో పైడితల్లి మాట్లాడుతూ పనులు జరుగుతున్న ప్రదేశాలలో ముందుగా సంబంధిత ఉపాధి హామీ పథకం అధికారులు కొలతలు ఇవ్వాలని పేర్కొన్నారు.కనీస వేతనం ప్రతి ఒక్కరికి అందాలని,ఈమేరకు ఉపాధి హామీ పథకం సిబ్బంది వేతనదారులకు అవగాహన కల్పిం చాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉష్ణో గ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పనిచేసే చోట నీడ ఉండే విధం గాను, త్రాగునీటి సౌకర్యం కల్పిం చాలని తెలిపారు.ఈపరిశీలనలో మండల ఈ ఓ పి ఆర్ డి ఎల్ గోపాల రావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు పన్ను చెల్లించని కొన్ని దుకాణాలు సీజ్



**విజయనగరం కార్పోరేషన్, మార్చి 24, మేజర్ న్యూస్:**

2024-25 ఆర్థిక సంవత్సరం వరకు పన్ను చెల్లించని దుకాణాలను కొన్నింటిని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. సహాయ కమిషనర్ కే అప్పలరాజు నేతృతంలో రెవెన్యూ సిబ్బంది పన్ను వసూలు ప్రక్రియలో భాగంగా ఈరోజు పిడబ్ల్యూ మార్కెట్ ప్రాంతంలో ఆస్తిపన్ను బకాయిల వసూళ్లను చేపట్టారు. అయితే కొంతమంది బకాయిదారులు ఇప్పటివరకు పన్నులు చెల్లించకుండా తాత్సారం చేయడంతో రెడ్ నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో కొన్ని దుకాణాలను మూసివేయించారు.దీంతో కొంతమంది తక్షణమే స్పందించి పన్నులు చెల్లించేందుకు అంగీకరించారు. మిగిలిన వారు కూడా త్వరలోనే పన్నులు చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అప్పటివరకు దుకాణాలను తెరవకూడదని సహాయ కమిషనర్ కె.అప్పలరాజు దుకాణదారులకు హెచ్చరించారు. ఈ సందర్భంగా కమీషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరాభివృద్ధికి ప్రజలు చెల్లించిన పన్నులే ముఖ్యమన్న విషయాన్ని గ్రహించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిస్తున్నప్పటికీ చాలామంది ఆస్తి పన్నులను, ఖాళీ స్థలముల పన్నులను, కొళాయి చార్జీలను చెల్లించలేదని అన్నారు. కావున వెంటనే పన్నులను చెల్లించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కౌన్సిలర్లను వేటాడుతున్న టి డి పి

-అధికారులకు పురపాలక చైర్మన్, వైస్ చైర్మన్ లపై అవిశ్వాస పత్రాలు -నియోజకవర్గం ఎమ్మెల్యే విజయచంద్ర



**పార్వతీపురం, మార్చి 24, మేజర్ న్యూస్ :**

పార్వతీపురం పురపాలక కౌన్సిల్ ఎన్నికై ఐదు నాలుగేళ్లయిన ఇప్పటివరకు వారి తీరులో మార్పు రాలేదని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. సోమవారం పురపాలక చైర్మన్,వైస్ చైర్మన్ ల అవిశ్వాస తీర్మాన పత్రాలను జెసి శోభిక, కమిషనర్ వెంకటేశ్వర్లకు అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు . వైకాపా అయామ్ లో ఏర్పాటు అయిన కౌన్సిల్ పట్టణ అభివృద్ధిలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలకు ఎన్నో హామీ ఇచ్చి కౌన్సిలర్లుగా ఎన్నికై వార్డుల అభివృద్ధికి ఏమీ చేయలేకపోతున్నాం అన్న అసంతృప్తి చాలామందిలో ఉందన్నారు. కూ టమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నచ్చి కొంతమంది కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరారని ఎమ్మెల్యే తెలిపారు. అందరం కలిసి పట్టణం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఉద్దేశంతో అడుగులు ముందుకు వేస్తున్నామని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. అవిశ్వాస తీర్మాన పత్రాలను అధికారులకు అందజేయడం జరిగిందని వారు ఏదో ఒక రోజు సమావేశం ఏర్పాటు చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ఆ సమావేశంలో ఎక్కువమంది కౌన్సిల్ సభ్యులు ఎవరికి మద్దతుగా ఉంటారో వారికి సంబంధించిన వారు చైర్పర్సన్, వైస్ చైర్మన్ల ఎన్నిక అవుతారని ఎమ్మెల్యే తెలిపారు. అందరి ఉద్దేశం పట్టణం అన్ని విధాల అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ముందుగా జేసీ శోభికకు అవిశ్వాస తీర్మాన పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జయప్రకాష్ నారాయణ, ద్వారపురెడ్డిశ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు, వైకాపా నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్షయరహిత సమాజానికి కృషి డీఎంహెచ్ఓ టి.వి. బాలకృష్ణ

**శ్రీకాకుళం, మార్చి 24, :**



క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ టి.వి. బాలకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో నిర్వహించనున్న కార్యక్రమాలను గురించి శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్షయ అంటువ్యాధి అని, ఇది గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందని ఆయన తెలిపారు. మైక్రో బ్యాక్టీరియా ట్యూబర్ క్లోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా ఈ వ్యాధి సోకుతుందని, ముఖ్యంగా ఊపిరితిత్తులకు ప్రమాదం చూపుతుందని ఆయన వివరించారు. జిల్లాలో గతేడాది 3,854 కేసులు నమోదు కాగా, ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 3,428 కేసులు నమోదైనట్లు తెలిపారు.సకాలంలో క్షయకు చికిత్స పొందాలని, లేదంటే మందులకు కూడా లొంగని మొండి వ్యాధిగా మారుతుందని డాక్టర్ బాలకృష్ణ హెచ్చరించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోని టీబీ కేంద్రంలో సంప్రదించాలని ఆయన సూచించారు. సకాలంలో చికిత్స చేసుకుంటే దీనిని పూర్తిగా నివారించవచ్చునని, క్షయ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు.క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు డి ఎం హెచ్ ఓ కార్యాలయం నుండి 7 రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం క్షయ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి టి.బి. ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం కింద క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం పంపిణీ చేసి, క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించిన దాతలను సత్కరించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి శ్రీకాంత్, డిఐఓ డాక్టర్ రాందాస్, డిపిఎమ్ఓ వాన సురేష్, డిప్యూటీ డెమో ఎం.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## 7 వారాలు ఉపాధి బకాయి బిల్లులు చెల్లించండి.



**సీతానగరం మార్చి 24 మేజర్ న్యూస్**

తమకు చెల్లించవలసిన ఏడు వారాల ఉపాధి హామీ బకాయిలను చెల్లించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం వద్ద సిపిఎం పార్టీ నాయకులతో కలిసి ఉపాధి హామీ వేతన్దారులు ఆందోళన నిరసన కార్యక్రమం నిర్వహించారు . ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ, మూడు నెలలుగా పనిచేస్తున్న ఉపాధి కూలీలకు ఇంతవరకు వేతనాలు చెల్లించకపోవడం , గత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న కొన్ని గ్రామాల్లో ఇంతవరకు పనులు కల్పించకపోవడం దారుణం అని, ఉపాదామి పథకంలో అనేక రకాలు పనులు ఉన్నప్పటికీ ఫారం ఫండ్( ఇంకుడు గుంతలు ) పనులే చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశిస్తున్నది. ఏప్రిల్ మే నెలలో ఎండలు తీవ్రంగా ఉండి భూమి గట్టిదనంగా ఉంటుందని, ఈ ప్రాంతంలో రైతులు మెట్టు భూములు తక్కువగా ఉంటాయి, పల్లపు భూముల్లో ఇంకుడు గుంతలు రావడానికి భూ యజమానులు ముందుకు రావడం లేదు, తద్వారా ఇంకుడు గుంతల తవ్వడం వేతనదారులకు కష్టతరం అని, తెలిపారు, ఉపాధి పనులు ద్వారా కూలీల కోసం కేటాయించిన ఉపాధి నిధులను ఇతర పనులకు గోశాలలు, సిసి రోడ్లు,ప్రభుత్వ భవనాలకు ప్రహరీ లాంటి పనులకు నిధులు మళ్లిస్తున్నందువలన ఉపాధి కూలీలకు నిర్దేశించిన వంద రోజులు పనులు, 14 రోజుల్లో బిల్లులు చెల్లింపు చట్టం లక్ష్యం చేరుకోలేకపోతున్నారు కావున తక్షణమే అందరికీ పూర్తిస్థాయిలో పనులు కల్పించాలని, బకాయి ఉన్న ఏడు వారాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏపీఓ గారికి అందజేశారు.. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చందనపల్లి కృష్ణ,,ప్రజాసంఘాలు నాయుకులు రెడ్డి వేణు జి. వెంకటరమణ,ఆర్, రమణ మూర్తి, బి అప్పారావు ఉపాధి వేతన దారులు జి భాస్కర్ రావు, దినేష్, అజయ్, పార్వతి,రమణమ్మ, మేరీ తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడీలకు రెండో విడత శిక్షణ తరగతులు

## - సిడిపిఓ ఎస్ సులేఖ.



**సీతానగరం మార్చ్ 24, మేజర్ న్యూస్:**

బలిజిపేట ప్రోజెక్ట్ పరిధిలో పెదంకలాం సెక్టార్ అంగన్వాడి కార్యకర్తలకు 41 మందికి రెండో విడత మూడు రోజులు పాటు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఐ సి డి ఎస్ సిడిపిఓ ఎస్ సులేఖ తెలిపారు. పోషణ భీ పడాయి భీ లో భాగంగా మరిపి వలస జిల్లా పరిషత్ పాఠశాలలో రెండో విడత శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడిపిఓ మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు చిన్నారుల బాలిక విద్య పైన మరియు ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు పాటించి శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. అంగనవాడి కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు తగు మేరకు విద్యా విషయాల పైన శ్రద్ధ వహించాలని అన్నారు. అలాగే కేంద్రాలకు వస్తున్న చిన్నారుల విషయంలో బాధ్యతతో ఉండాలని అన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలకు పోషన్ బి పడాయి బి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. మూడు రోజులపాటు అందిస్తున్న ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో సూపర్వైజర్ ఉ పూర్ణిమ మరియు సిబ్బంది హాజరయ్యారు.

## సకాలంలో సరుకులు పంపిణీ చెయ్యాలి: కిమిడి

### -డీలర్లకు నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే....

**చీపురుపల్లి మార్చి 24 మేజర్ న్యూస్:**



పౌరసరఫరాల శాఖ ద్వారా అందించే రేషన్ సరుకులను ప్రజలకు సకాలంలో అందజేయాలని రేషన్ డీలర్లకు స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు సూచించారు. చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో గల చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలకు సంబంధించి నూతనంగా నియామకమైన తొమ్మిది మంది రేషన్ డీలర్లకు సోమవారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు, ఆర్డీవో సత్యవాణి కలిసి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళా వెంకటరావు మాట్లాడుతూ రేషన్ డీలర్లుగా కొత్తగా నియామకమైన వారు ప్రజలకు నమ్మకంగా సేవలను అందజేయాలని కోరారు. ప్రజలకి సేవ చేసి, కొలతల్లో తేడాలు లేకుండా చూడాలని, సకాలంలో సరుకులు అందించాలన్నారు. నియామక పత్రాలు పొందిన రేషన్ డీలర్లు ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తంచేశారు. నాలుగు మండలాల తహశీల్దార్ లు, టీడీపీ నాయకులు రౌతు కాము నాయుడు, సారేపాక సురేష్, తాడ్డి సన్యాసి నాయుడు, జిల్లా బీసీ సెల్ ప్రతినిధి దాసరి శివ ప్రసాద్, జనసేన నాయకులు వి శ్రీనివాసరావు, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## తమ్మాపురం వ్యక్తిపై పోర్జరీ కేసు నమోదు

**నెల్లిమర్ల, మార్చి 24, మేజర్ న్యూస్:**

నెల్లిమర్ల పోలీసుస్టేషన్ పరిధి తమ్మాపురం గ్రామానికి చెందిన గవిడి శ్రీనువాసరావుపై సోమవారం పోర్జరీ కేసు నమోదైనట్లు ఎస్ఐ బి గణేష్ వెల్లడించారు. విశాఖపట్నంనకు చెందిన పైడి అమ్మినాయుడు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేసి డిమాండ్ కి తరలించినట్లు చెప్పారు. పోలీసుల వివరాలు ప్రకారం... 2022లో తనకు ఆర్థిక పరిస్థితులు బాగోలేదని తనకు డబ్బు అవసరమని దీనికి తమ్మాపురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 122-10లో 77 సెంట్లు, 122-5%ఎ%లో 75 సెంట్లు మొత్తంగా 1.52 ఎకరాలు భూమిని శ్రీనువాసరావు వద్ద అమ్మినాయుడు రూ.8.36 లక్షలకు కొనుగోలు చేశాడు. అయితే ఆ భూమి రిజిస్ట్రేషన్ చేయాలని పలుమార్లు కోరినా శ్రీనివాసరావు పట్టించుకోలేదు. దీంతో అనుమానం వచ్చిన ఫిర్యాదుదారుడు నెల్లిమర్ల తహశీల్దార్ కార్యాలయంలో సదరు భూమికి సంబంధించి ఈసీ తీయించగా ఆ భూమి నెల్లిమర్ల డిసిసిబి బ్యాంకులో రూ.15 లక్షలకు తాకట్టు పెట్టారు. ఇందులో సర్వే నెంబరు 122-5%ఎ%లో 77 సెంట్లు భూమిని శ్రీనువాసరావు 16-06-2022న వేసలపు రామారావుకి రూ.4.13 లక్షలు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. అలాగే ఇదే సర్వే నెంబరులో 333.33 చదరపు గజాలు భూమిని ఖాళీ స్థలంగా చూపించి తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి తేది: 04-04-2023 గవిడి శ్రీనివాసరావు తన భార్య గవిడి రాజుకి గిప్టు సెటిల్ మెంట్ చేసినట్లు తెలిసింది. ఆ భూమిని శ్రీరామ్ ఫైనాన్స్ వారికి తనఖా రిజిస్ట్రేషన్ చేసి వారి వద్ద డబ్బులు వాడుకున్నట్లు తెలిసింది. ఈ కేసులో దాక్యుమెంటరీ ఎవెడెన్స్ తగిన సాక్ష్యాలు ఉన్న నేపథ్యంలో నిందితుడు గవిడి శ్రీనివాసరావుని అరెస్టుచేసి డిమాండ్ కి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## పాఠశాల లో విలీనం చేయకుండా ఎమ్మెల్యే బేబినాయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి:

### -" యూటీఎఫ్ రాష్ట్ర ప్రతినిధి విజయగౌరి



**బొబ్బిలి, మార్చి 24: మేజర్ న్యూస్:**

బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలు విలీనం కాకుండా ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కె కె రంగారావు (బేబినాయన) రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఏపి యూటీఎఫ్ నాయకులు విజయగౌరి కోరారు.ఈ మేరకు సోమవారం ఆయా ఉపాధ్యాయుల తో కలిసి వినతి పత్రం శెట్టి అందజేశారు. మూడు కిలోమీటర్ల లోపు ఉన్న పాఠశాల ను విలీనం చేయవద్దని ఎమ్మెల్యే బేబినాయన ను కోరారు. అలాగే జీఓ నెంబర్ 117 రద్దు చేసి నప్పటికీ వేరే ప్రతిపాదన లు రాష్ట్ర ప్రభుత్వం తేవడం వలన బొబ్బిలి పరిధిలోని ఆరు యుపి పాఠశాలలు మూత పాడడం జరుగుతుందని చెప్పారు.దీని ద్వారా సుమారు 280 మంది విద్యార్థులు దూరంగా ఉన్న పాఠశాల కు వెళ్ళ వలసి వస్తుంది అని తెలిపారు.బేసిక్ ప్రైమరీ పాఠశాల పేరుతో 3,4,5 తరగతులను విలీనం చేయడం వల్ల పాఠశాలు ప్రమాదం లో ఉన్నాయని చెప్పారు. వీటిని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### -భారీగా జరిమానాలు



**రామభద్రపురం, మార్చి 24 మేజర్ న్యూస్**

మద్యంతాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెలమల ప్రసాదరావు హెచ్చరించారు. సంకల్పం కార్యక్రమం కింద జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసు స్టేషన్లో సోమవారం సాయంత్రం ఆటో డ్రైవర్లకు మత్తు పదార్థాల వినియోగం, స్పీడ్గా వాహనాలు నడపడం, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాల వాడకం వలన కుటుంబాలు ఆర్థికంగా నాశనం కావడమే కాకుండా ఆరోగ్యం కూడా దెబ్బతిం టుందని తెలిపారు. ఇటీవల కాలంలో గంజాయి వాడకం, క్రికెట్ బెట్టింగులకు పలువురు బానిసలవుతున్నారని వాటికి ప్రతీ ఒక్కరూ దూరంగా ఉండాలని తెలిపారు. అలాగే ఆటోలు నడిపినప్పుడు డ్రైవర్ పక్కనప్రయాణీకుడిని కూర్చోబెట్టరాదని, స్పీడ్గా వాహనాలు నడపకుండా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. అలాగే గృహహింస, మహిళలపై దాడులు చేయరాదన్నారు. ప్రతీ ఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలని, గతంలో కాకుండా ప్రస్తుతం ఫోక్సో వంటి కఠినమైన చట్టాలు వచ్చాయని తెలిపారు. ఇటీవల కాలంలో ఆన్లైన్మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు, ఇతర వివరాలు కావాలని అడిగితే పోలీస లకు సమాచారం అందించాలని తెలిపారు. ఏటీఎం వద్ద కూడా ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయని, వీటిపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు కూడా పాల్గొన్నారు.

## గంజాయి కేసులో పరారీలో ఉన్న ముద్దాయిని అరెస్టు

### -ఏ ఎల్ పురం ఎస్సై వై తారకేశ్వరరావు

**గొలుగొండ మార్చి 23 మేజర్ న్యూస్**



గొలుగొండ మండలంలో ఏ ఎల్ పురం పోలీస్ స్టేషన్ ఎస్సై వై తారకేశ్వరరావు తెలిపిన వివరాలు పాత గంజాయి కేసులో గత నాలుగున్నర సంవత్సరాలనుంచి పరారీలో ఉన్నటువంటి ముద్దాయి అయినటువంటి నల్లపాటి వెంకటేశ్వర్లు తండ్రి చెంచయ్య తెల్లబెల్లి గ్రామం నల్గొండ జిల్లా తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తి ని రాబడిన ఖచ్చితమైన సమాచారంతో తేదీ 24/03/2025న ఏ ఎల్ పురం ఎస్సై మరియు సిబ్బంది కలసి పాతకృష్ణాదేవి పేట గ్రామం శివారు ప్రాంతంలో పాత గంజాయి కేసులో ముద్దాయినిఈరోజు అరెస్ట్ చేసి కోర్టులో ఆధారపచ్చగా నర్సీపట్నం జడ్జి గారు 14 రోజులు రిమాండ్ విధించారు అని ఎస్సై వై తారకేశ్వరరావు విలేకరులకు తెలియపరిచారు

## పి ఆర్ వి డి 1 ఫోటోని ఈ వార్తకు వాడగలరు

### -పెదముషిడివాడలో భూ ఆక్రమణ ప్రదేశాలలో బోర్డులు ఏర్పాటు

**పరవాడ ,మార్చి 24 ,మేజర్ న్యూస్:**



పభుత్వ భూములు ,గెడ్డవాగులు ఆక్రమణ నేరం అంటూ తాసిల్దార్ అంబేద్కర్ రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేకంగా ఆక్రమణ ప్రదేశాలలో బోర్డులు ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా పెదముషిడివాడ సర్వే నెంబర్లు 152,378,379,406 నెంబర్లలో ఆక్రమణదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో తరచూ రెవిన్యూ సిబ్బంది వెళ్లి వాటిని అడ్డుకుంటున్న సరే ఆక్రమణదారులు ప్రభుత్వ సెలవు దినాలలో భవన నిర్మాణాలు చేయడానికి పనులు చేస్తుండగా వాటిని నిలిపివేయించిన వీఆర్వో పృథ్వి ఈ విషయాన్ని తాసిల్దార్ అంబేద్కర్ దృష్టికి దీంతో సోమవారం రెవెన్యూ ప్రత్యేక సిబ్బందితో కలిసి పెద ముషి డివాడలో పూర్తిస్థాయిలో భూ ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలలో భాగంగా ప్రతి ఆక్రమణచోట ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం 1905 ప్రకారం బోర్డులు పాతి ప్రభుత్వ భూమి ఆక్రమణ నేరం అని అంటూ అక్కడి ప్రజలను హెచ్చరించారు. ఇకపై పెదముషిడి వాడలో ప్రభుత్వ భూముల ఆక్రమణ జరిగినట్లయితే నేరుగా తమ కార్యాలయానికి ఫిర్యాదు చేసిన ఎడల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ అంబేద్కర్ తెలిపారు.

# చేయి చేయి కలుపుదాం క్షయ వ్యాధిని తరిమికొడదాం




గాజువాక, మార్చి 24, మేజర్ న్యూస్

చేయి చేయి కలుపుదాం క్షయ వ్యాధిని దూరం చేద్దామంటూ ర్యాలీ నిర్వహించారు. సోమవారం నాడు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డిపిఎస్ కోఆర్డినేటర్ లోకేష్ అగనంపూడి టిబి యూనిట్ ఎస్ టి ఎస్ వి.అనిల్ కుమార్, ఎస్ టి ఎల్ ఎస్ ఎం. వాసు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేసి టిబి లక్షణాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూటిబి వ్యాధి లక్షణాలు, నిర్ధారణ,చికిత్య పూర్తిగా ఉచితమని రెండు వారాలకు పైబడిన దగ్గు ఉండే వారు దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఏ ఎఫ్ బి, కల పరీక్ష చేయించుకోవాలని అన్నారు. చేయి చేయి కలుపుదాం - టి.బి.ని తరిమికొడదాం, టి.బి అంటే భయం వద్దు - చికిత, ముద్దు,టి.బి. ఓడిపోతుంది - దేశం గెలుస్తుంది,మన అందరి పంతం- టి.బి. అంతం మానవహారం అనంతరం నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టి బి హెచ్ వీలు శైలజ ,రాణి ,లోవరాజు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఠ అధిక సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రపాలెం పి హెచ్ సి కి అదనపు డాక్టర్లు నియమిస్తాం

## -ఎ,డి,ఎం అండ్ హెచ్,ఓ,ప్రతాప్....



కొయ్యూరు మార్చ్ 24మేజర్ న్యూస్:

రాజేంద్రపాలెం మండల కేంద్ర పీహెచ్సీ ని సందర్శించిన అడిషనల్ డి.ఎం. అండ్. హెచ్. ఓ. ఇచ్చిన హామీ లను బట్టి మండల ప్రజలకు రానున్న రోజులలో మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశిద్దాం. సోమవారం స్థానిక పిహెచ్సిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన అడిషనల్ డి .ఎం అండ్ హెచ్ .ఓ. ప్రతాప్ విలేకరులతో మాట్లాడారు . పీహెచ్సీకి మందులు సమృద్ధిగా సరఫరా చేస్తామని, రక్త పరీక్షలు ప్రైవేట్ గా చేయించుకునే ఇబ్బంది లేకుండా, రోగులకు అన్ని సదుపాయాలు కలిగిస్తామన్నారు. అలాగే అనునిత్యం వైద్యులు స్థానికంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. 2008, 2009 సంవత్సరాలలో పీహెచ్సీకి మంజూరైన నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు చేయనున్నామని అడిషనల్ డి.ఎం. అండ్ హెచ్ .ఓ ప్రతాప్ హామీ ఇచ్చారు. తదనంతరం వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి సంపత్ బాబు, సి. హెచ్ .ఓ .ప్రశాంత్ తదితర మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యం భారి నుండి రక్షించాలి అని అంటూ పరవాడ మండల కార్యాలయాలు ముందు ధర్నా



పరవాడ మార్చి 24 మేజర్ న్యూస్

సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యం బారి నుండి తమరు రక్షించాలని అంటూ గ్రామానికి చెందిన పలువురు ప్రజలు సోమవారం స్థానిక మండల కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు అందించారు.మూల స్వయంవరం గ్రామాన్ని సురక్షమైన ప్రాంతానికి తరలించాలి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కే లోకనాథం డిమాండ్. పరవాడ మండలం కలపాక పంచాయతీ మూల స్వయంవరం గ్రామం ఎన్టిపిసి కాలుష్యంతో తీవ్రమైన జబ్బులతో జబ్బులతో కాలుష్య కోరల్లో చిక్కుకొని అల్లాడుతున్నారని గ్రామాన్ని వెంటనే సురక్షమైన ప్రాంతానికి తరలించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే లోకనాథం డిమాండ్ చేశారు. సోమవారం పరవాడ తాసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం వద్ద మూల స్వయంవరం గ్రామస్తులు గ్రామాన్ని తరలించాలని ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని గ్రామాన్ని కాలుష్యం చేస్తున్న ఎన్టిపిసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తుల ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలియజేస్తూ లోకనాథం గ్రామంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, రెవెన్యూ, మండల అభివృద్ధి అధికారి యంత్రాంగం పర్యటించి గ్రామాన్ని వెంటనే ప్రాంతానికి తరలించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మంచినీరికి, మంచి గాలికి, మంచి నేల కి, మంచి నిద్రకి, ఈ గ్రామ ప్రజలు నోచుకోవడం లేవని అధికారుల ముందు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పునీటి పడటం వలన పంటల పండక పోవడంతో పాటు విద్యుత్ వైర్లు తెగిపడుతున్నాయని విద్యుత్ ఉండడం లేదని కిడ్నీ, చర్మం, ఊపిరితిత్తులు, కంటి సమస్య పశువులు చూలు నిలవకపోవడం అనేక జబ్బులతో అలమటిస్తున్నారని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చే హామీ ప్రకారం గ్రామాన్ని వెంటనే సురక్షమైన ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామాన్ని తరలించడానికి అధికారులు చర్యలు చేపట్టకపోతే ఎన్టిపిసి పరిపాలన కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మండల తాసిల్దార్, ఎంపీడీవోలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గని శెట్టి సత్యనారాయణ, నాగిరెడ్డి రామారావు,బొండా సూరిబాబు,తుంపాల మరిడియా,బత్తిన రాముడు,మరిస రవి,బోండా రాజు,బొండా సరోజినీ, బోండా అనురాధ,బత్తిన లక్ష్మి,బత్తిన పార్వతి,కాలపు రెడ్డి సత్యవతి,కాలిపరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా శ్రీ నూకాలమ్మ అమ్మవారి పాలిమేర కార్యక్రమం



భీమునిపట్నం, మార్చి 24, మేజర్ న్యూస్ :

భీమిలీ గ్రామ దేవత శ్రీ నూకాలమ్మ ఉత్సవాలు సందర్భంగా సోమవారం ఉదయం ఐదు గంటలకి అమ్మవారి పొలిమేర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి గరగను పాత బస్ స్టాండ్ చదును పట్టు వద్ద బయలుదేరి చిన్న బజార్ , బ్యాంక్ కోలని కుమ్మరిపాలెం గ్రామ పుర వీధుల్లో అమ్మవారి గరగను ఊరేగించి చిన్న బజార్ లో కర్రోతు కుటుంబీకుల ఇంటి వద్ద నుంచి సాయింత్రం ఆరుగంటలకు మేళ తాళాలతో ఊరేగించి చదును పట్టు వద్ద కు తెచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు సత్తిరాజు వెంకటేష్ ,మారుతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు అల్లిపిల్లి వేణుబాబు ప్రధాన కార్యదర్శి ఎచ్చెర్ల హరి కోశాధికారి పిన్నింటి ఎర్రయ్య రెడ్డి కోఆర్డినేటర్ గౌరపల్లి సన్యాసిరావు ఆర్గనైజింగ్ సెక్రటరీ పాసి వినోద్ కుమార్ ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గంటా నూకరాజు ఉత్సవ కమిటీ సభ్యులు ఎం .ముత్యాలరావు, మైలపల్లి లక్ష్మణ రావు, గొలగాని నరేంద్ర కుమార్, వాసుపల్లి. కొండ బాబు, ప్రగడ చంటి , తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ పూలింగ్ ప్లాట్లును వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలి.

## -తహశీల్దారు కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా.




అనకాపల్లి, మార్చి 24, మేజర్ న్యూస్:

ల్యాండ్ పోలింగ్ భూములు సేకరించిన రైతులకి నిబంధనల ప్రకారం అభివృద్ధి చేసిన ఉడా ప్లాట్లను వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అనకాపల్లి తాహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శంకరావు, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా అనకాపల్లి మండలం కూండ్రం, కుంచంగి, రొంగలివానిపాలెం, వి.జె. పాలెం, సీతానగరం, మామిడిపాలెం, కోండుపాలెం, సంతపాలెం, కోదూరు రెవెన్యూ గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతుల నుండి భూములు సేకరించడం జరిగిందని, ఇప్పటికి నాలుగేళ్ళు పై బడుతున్నప్పటికీ రైతులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా వుండడంతో రైతులు ఇబ్బందులు పడుతూ ఆందోళన చెందుతున్నారు. గౌరవ హైకోర్టులో దీనిపై ప్రజా ప్రయోజనార్థం బలవంతంగా ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు సమీకరించవద్దని పిటిషన్ వేయగా అప్పటి ప్రభుత్వం హడావడిగా జీడి, మామిడి తోటలు పూత, పింజుతో వుండగా అక్రమంగా దౌర్జన్యంగా నిబంధనలను ఉల్లంఘించి ఆ చెట్లును తొలగించడం జరిగిందని దీంతో రైతులకు నష్టం కలిగిందన్నారు. దీనివలన 60వేల నుండి 2 లక్షల రూపాయాల వరకూ ఒక్కొక్క రైతుకి ప్రతి సంవత్సరం నష్టం జరుగుతుందని ఆ నష్టాన్ని పూడ్చవలిసిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందన్నారు. ఇప్పటికైనా ప్లాట్లును వెంటనే రైతులకు రిజిస్ట్రేషన్ చేయాలని, రాజధాని అమరావతి రైతులు వలే ప్రతి రైతుకు కుటుంబానికి ప్రతి సంవత్సరం కౌలు చెల్లించాలని, ఇంతవరకు నష్టపోయిన పంటలకు పంట నష్టపరిహారం వడ్డీతో సహా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, బొప్పే ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్య బాబు, కె.ఈశ్వరరావు, జి.సుభాషిణి, చలపతి, బి.నుక అప్పారావు, బాధిత కుటుంబాల రైతులు పాల్గొన్నారు

## గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పలాస మెప్మా సిబ్బంది.

## -ప్రశంసించిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష.



పలాస,మార్చి 24,మేజర్ న్యూస్.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పలాస మెప్మా సిబ్బందికి చోటు లభించింది.ఈ సందర్భంగా సోమవారం పలాస మెప్మా కార్యాలయంంలో పనిచేస్తున్న సిబ్బందికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రశంసలు తెలిపారు.ఇటీవల మెప్మా సిబ్బంది తయారు చేసిన వివిధ వస్తువులపై నాలుగు వరల్డ్ రికార్డులు సొంతం చేసుకొని,గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో మెప్మా పేరు సొంతం చేసుకొంది.దానిలో పలాసకు చెందిన మెప్మా సిబ్బంది పాత్ర ఉండడం గుర్తించి మెప్మా ఆర్పీలకు,టిఎల్ఎఫ్ ఓబి లకు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల పత్రాలను ఎమ్మెల్యే గౌతు శిరీష చేతులు మీదుగా అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ మెప్మా సిబ్బంది పనితీరు చాలా బాగుందని,రానున్న కాలంలో కూడా మరింత మంచిగా పనిచేయాలన్నారు. జిల్లాలోనే పలాస మెప్మా మొదటి స్థానంలో నిలవడం అనేది గొప్పవిషయమని వారికి అభినందించారు.ఈ కార్యక్రమంలో మెప్మా, డిఇఓ,సిఓ సిఎల్ఆర్పిలు,ఆర్పిఎస్, టీఎల్ఎఫ్ ఓబిలు పట్టణ అధ్యక్షురాలు, టి.రాజ్యలక్ష్మి, సిటి మిషన్ మేనేజర్ పి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మాజీ సైనికుల సంఘం సంయుక్త కార్యదర్శిగా మన్మధరావు.



పలాస,మార్చి 24,మేజర్ న్యూస్.

రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శిగా పలాసకు చెందిన ఇళ్ల మన్మధరావును సభ్యులు ఎనుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమెదటి సారిగా ఒకే రాష్ట్రం,ఒకే యూనియన్ అనే నినాదంతో ఆదివారం విజయవాడ స్వతంత్ర సమరయోధులు భవనంలో ఎన్నికలు నిర్వహించారు.శ్రీకాకుళం జిల్లా మాజీ సైనికులు ఫెడరేషన్ తరుపున కాశీబుగ్గ మాజీ సైనికుల సంఘం అధ్యక్షులుగా ఉన్న ఇళ్ల మన్మధరావు పోటీ చేసి ప్రత్యర్థిపై ఘన విజయం సాదించారు.రాష్ట్రం మొత్తంలో ఉన్న 130 మాజీ సైనికుల సంక్షేమ సంఘాల నుంచి ఓట్లు వేసి పలాస వాసిని గెలిపించడం గొప్ప విషయం. కాగా విజయం సాధించి పలాస కు చేరుకున్న ఇళ్ల మన్మధరావుకు పలాసకు చెందిన మాజీ సైనికుల సంఘం సభ్యులు పలస రైల్వే స్టేషన్ కు చేరుకొని మాధవరావుకు అభినందించారు.ఆయన ఇంటి వరకు గౌరవంగా తీసుకువెళ్లడంతో, ఇళ్ల మన్మధరావు సభ్యులందరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు.

## స. హ. చట్టం జిల్లా అధ్యక్షుడిగా బొత్స. రాము



ఆనందపురం మార్చ్24 మేజర్ న్యూస్

విశాఖ జిల్లా సమాచార హక్కు చట్టం అధ్యక్షుడిగా ఆనందపురం మండలం సొంట్యం నీళ్ల కుండీల జంక్షన్ కు చెందిన బొత్స రాము నియమితులయ్యారు. ఈ మేరకు ప్రజాసంకల్ప వేదిక జాతీయ అధ్యక్షుడు మదిర రంగసాయిరెడ్డి నుండి నియామక పత్రం అందుకున్నారు. ఇతనితో పాటు కార్యదర్శులుగా గొలజాన అప్పలరాజు,లెంక అప్పారావు, సంయుక్త కార్యదర్శిగా ఎంఎవన్ పాత్రుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పువ్వాడ సత్యనారాయణ గుప్తా, యాంటీ కరప్షన్ జిల్లా అధ్యక్షుడిగా మజ్జి అప్పలరాజు నియమితులయ్యారు.

## జిల్లా రైతు విభాగ అధ్యక్షుడిగా బోని. అప్పలనాయుడు

ఆనందపురం మార్చి 24 మేజర్ న్యూస్



విశాఖజిల్లా రైతు విభాగ అధ్యక్షుడిగా ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన బోని అప్పలనాయుడు నియమితులయ్యారు. వైయస్సార్సీపి జిల్లా రైతు విభాగ అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.అందులో విశాఖపట్నం జిల్లా అధ్యక్షులుగా అప్పలనాయుడు నియమిస్తూ ఉత్తరాలు జారీ చేశారు .అప్పలనాయుడు గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హాయంలో భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గాను, ఎంపీటీసీగాను సర్పంచ్ గాను పనిచేశారు ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తానన్నారు రైతు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డికి,పార్టీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ భీమిలి నియోజకవర్గం ఇన్చార్జ్ మజ్జి శ్రీనివాసరావుకి(చిన్నాశ్రీను) కు కృతజ్ఞతలు తెలిపారు

## 21 కిలోల గంజాయి తో ఒకరి అరెస్ట్.



పలాస,మార్చి 24,మేజర్ న్యూస్.

అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల గంజాయితో ఒకరిని కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారు.కాశీబుగ్గ రైల్వే స్టేషన్ పరిధిలో సోమవారం 21 కిలోల గంజాయి తో పట్టుకొని అమౌంట్ ఆనంద్ అనే నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందని కాశీబుగ్గ డిఎస్పి వి వెంకట అప్పారావు తెలిపారు.ఈ మేరకు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు.ఆయన కథనం ప్రకారం కబు ఆనంద్ మరియు ఆమోద్ ఆనంద్ లు కజిన్ బ్రదర్స్ మరియు ఒకే గ్రామం.కబు ఆనంద్ తన గ్రామం సబరపల్లి గ్రామం,ఉదయగిరి, ఒడిష లో గంజాయి పండిస్తూ ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటాడు.ఆదివారం ముంబై కి చెందిన మేధా,కబు ఆనంద్ గ్రామానికి వచ్చి గంజాయి కావాలని అడుగగా,కబు ఆనంద్ సుమారు 21 కేజీల గంజాయిని 6 పాకెట్లుగా చేసి రెండు బాగ్ లలో పెట్టి ఆమోద్ ఆనంద్,నిఖిల్ పాని కి ఇచ్చి మేధా ను పలాస రైల్వే స్టేషన్ వద్ద కు డ్రాప్ చేసి వస్తే 3 వేలు రూపాయలు ఇస్తానని చెప్పి పంపించగా ఆమోద్ ఆనంద్,నిఖిల్ పాని మరియు మేధా లు కాశీబుగ్గ రాగా మేధా ముందుగా రైల్వే స్టేషన్ కి టికెట్ కోసం వెళ్లిపోగా,ఆమోద్ ఆనంద్ మరియు నిఖిల్ పాని లు పలాస రైల్వే స్టేషన్ వైపు నడిచి వస్తుండగా పోలీస్ లను చూసి నిఖిల్ పాని గంజాయి బాగ్ ని వదిలి పారిపోగా ఆమోద్ ఆనంద్ రెండు బాగ్ లు గంజాయి తో పట్టుపడ్డాడని పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను పెట్టుకోవాల్సి ఉందని అన్నారు. ఈ సమావేశంలో కాశీబుగ్గ సిఐ పి సూర్యనారాయణ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మండలంలోని మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం.



కొయ్యూరు మార్చ్ 24 మేజర్ న్యూస్ :

నేడు మండలంలోని కాకరపాడు విద్యుత్తు సబ్ స్టేషన్ లో మరమ్మత్తులు పెయింటింగ్ వర్కులు చేపడుతుండటంతో నేటి ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా లో అంతరాయం కలుగుతుందని దీనిని గుర్తించి మండల ప్రజలు సహకరించాలని పాడేరు ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎం అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మరమ్మత్తుల వలన కాకరపాడు సబ్ స్టేషన్ పరిధిలోని కాకరపాడు,కొయ్యూరు, సింగవరం, చింతవాని పాలెం, మర్రివాడ,లూసం, మంప, రేవళ్లు, ఎం మాకవరం, పిట్టచలం,నడింపాలెం, చింతలపూడి, గింజర్తి, చీడిపాలెం,దొడ్డవరం, రాజేంద్రపాలెం, సురేంద్ర పాలెం, నిమ్మలపాలెం,తుమ్మలబంద, గుడ్లపల్లి,బూదరాళ్ల,గ్రామాలలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన అన్నారు.

## కూటమి ప్రభుత్వం లోనే రోడ్ లకు మహర్దశ.

## -పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష.

పలాస,మార్చి 24,మేజర్ న్యూస్.



కూటమి ప్రభుత్వం లోనే రోడ్ లకు మహర్దశ చేకూరిందని,అలాగే పట్టణాలలో కాని గ్రామాలలో కాని మౌళిక సదుపయాలు కల్పన, వివిధ అభివృద్ధి పనలు శ ం ే ం గా జరుగుతున్నాయని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆనందం వ్యక్తం చేశారు.పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రోటరీనగర్,మారుతీనగర్ లో పలు సిమ్మెంట్ రోడ్లకు ఆమె సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడూ గత ప్రభుత్వంలో ఎక్కడ అభివృద్ధి పనులు చేపట్టకుండా పట్టణాలు,గ్రామాలలో మౌళిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బళ్ళ గిరిబాబుతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.పవర్ బోరు ప్రారంభం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు కావు వీధిలో పవర్ బోర్ ను సోమవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దానిని గుర్తించి ప్రజలకు తాగునీరు అందించేందకు తాత్కాలిక చర్యలలో భాగంగా పవర్ బోరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.మున్సిపాలిటీ ప్రజలకు తాగనీటి సమస్య శాశ్వత పరిష్కారం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ ఎన్.రామారావు,ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు,కూటమి నాయకులు బడ్డ నాగరాజు,గాలి క్రిష్ణారావు,అంబటి క్రిష్ణమూర్తి, మల్లిపెద్ది నరేంద్ర కుమార్ (చిన్ని,యవ్వారి మోహనరావు,శాసనపురి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి 30 వేలు విరాళం



విజయనగరం, మార్చి 24 మేజర్ న్యూస్

విజయనగరం నియోజకవర్గంలో కోరుకొండ గ్రామంలో దుర్గాదేవి ఆలయ నిర్మాణం కోసం జనసేన పార్టీ సీనియర్ నేత గురాన అయ్యలు విరాళం అందజేశారు..సోమవారం తన కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు 30 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక , సామాజిక కార్యక్రమాలకు తన వంతు సహకరం ఎల్లప్పుడు వుంటుందన్నారు.

# విశాఖలో వాటర్ ప్రూఫ్ ఒప్పో ఎఫ్ 29 ఆవిష్కరణ

విశాఖపట్నం, మేజర్ న్యూస్, మార్చి 24:

టెక్నాలజీకి ప్రాధాన్యత నిస్తూ వివిధ సంస్థలను ప్రోత్సహిస్తున్న ఒప్పో ఆంధ్రప్రదేశ్లో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అనేక ఆవిష్కరణలు చేపడుతున్నట్టు ప్రొడక్ట్ మార్కెటింగ్ మేనేజర్ (కమ్యూనికేషన్) క్షితిజ్ అరోరా తెలిపారు. సోమవారం విశాఖలోని బీచ్ రోడ్ లో ఒక హొటల్లో ఒప్పో ఎఫ్ 29 ఆవిష్కరణ చేశారు. విలక్షణ వాతావరణాన్ని తట్టుకునే రీతిలో ఒప్పో ఫ్ 29 భారతదేశంలో వివిధ ప్రాంతాలలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తయారు చేయబడిందని ఆరోరా తెలిపారు. తీవ్రమైన ఎండ లేదా తీవ్రమైన చలి మంచు కలిగిన ప్రాంతాల్లో సైతం మొబైల్ ఫోన్ సక్రమంగా వినియోగించే రీతిలో అత్యంత మన్నిక వస్తుందన్నారు. భారతదేశంలోని బెంగళూరుకు చెందిన సొసైటీ జనరల్ సర్వేలెన్స్ దీనిని నీటి నిరోధ కోసం పరీక్షించి సామర్థ్యాన్ని నిరూపించారని సంస్థ ప్రతినిధి తెలిపారు. ఒప్పో ఇండియా ఛాంపియన్ సిరీస్ గా మంచి నెట్వర్క్ తో ప్రపంచ స్థాయి ఇంజనీరింగ్ మిలటరీ గ్రేడ్ దృఢత్వం కలిగిన ఫోన్ గా అభివర్ణించారు. నూతన టెక్నాలజీతో నీరు, వేడి, చల్లని పదార్థం వంటివి ఫోన్ పై పడినప్పటికీ ఎటువంటి డ్యామేజీ కలగకుండా, పడిపోయినప్పుడు విరిగిపోకుండా ఉండే అత్యధిక టెక్నాలజీని వినియోగించి ఆవిష్కరించిన ఎఫ్ 29 ఫోన్ గురించి వివరించారు.

# న్యాయ విజ్ఞాన సదస్సు



కురుపాం, మేజర్ న్యూస్, మార్చి 24:

కురుపాం మండలం పూతికవలస గ్రామంలో జె సౌమ్య జోసఫిన్ చైర్మన్ మరియు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, మండల న్యాయ సేవా సమితి కురుపాం వారి నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్యఅతిథిగా జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ స్వామ్య జోసెఫ్ పాల్గొన్నారు అనంతరం న్యాయ సదస్సులో మాట్లాడుతూ ముఖ్యంగా ఫోక్సో కేసుల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాంప్రసాద్ జి రాజ్ కుమార్ మండల సేవా సంస్థ సిబ్బంది పాలకొల్లు శ్రీనివాస్ ట్రైనీ ఎస్సైలు ఈ శ్రీనివాసులు శ్రావణి లావణ్య హెచ్ సి అసరయ్య సంగమేశు పి సుధా అందవరపు కోటేశ్వరరావు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# పార్లమెంట్లో అందరికీ అందుబాటులో అరకు కాఫీ

అరకులోయ, మార్చి 24, మేజర్ న్యూస్:

అరకు కాఫీని విస్తృతస్థాయిలో ప్రమోట్ చేయడంలో భాగంగా కూటమి ప్రభుత్వం పార్లమెంట్ సెంట్రల్ హౌస్ లో ఆ కాఫీని అందుబాటులోకి తెచ్చింది. గిరిజన కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో లోక్ సభ ప్రాంగణంలో రెండు స్టాళ్లను ఏర్పాటు చేయించారు. ఈ స్టాళ్లను లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర ప్రభుత్వ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్,కిరణ్ రిజీజు లాంఛనంగా ప్రారంభించారు. స్టాళ్లలో చేసిన కాఫీని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి.సంధ్యారాణి, రాష్ట్ర



గిరిజన సహకార సంస్థ చైర్మన్,మాజీ మంత్రి కిడారి.శ్రావణ్ కుమార్, గిరిజన సహకార సంస్థ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ కల్పనా కుమారి కేంద్ర మంత్రులకు,లోక్ సభ స్పీకర్ కు, పార్లమెంట్ సభ్యులకు అందజేశారు. పార్లమెంట్ సెంట్రల్ హౌస్ లో కాఫీ స్టాల్స్ ప్రారంభించడంతో అరకు కాఫీ గా ప్రత్యేక గుర్తింపు పొందిన మన్యం కాఫీకి అరుదైన ఖ్యాతి లభించిందని చెప్పవచ్చు. ఆదివాసులు పండించిన అరకు కాఫీ పార్లమెంట్ సాక్షిగా మరో మారు వార్తల్లో నిలిచిందని చెప్పడంలో సందేహం లేదు. గిరిజనులు సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేయడమే ఈ కాఫీకి ప్రత్యేక గుర్తింపు రావడానికి కారణం అని తెలుస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరకు కాపీని జాతీయస్థాయిలో ప్రమోట్ చేసేందుకు వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో అరకు కాపీ స్టాళ్లను ప్రారంభించిన ముఖ్యమంత్రి లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ను ఒప్పించి పార్లమెంట్ ఆవరణలో ప్రజాప్రతినిధులకు అరకు కాపీ రుచి చూసే సౌకర్యాన్ని కల్పించారు. పార్లమెంట్,అసెంబ్లీ ఆవరణాల్లో అరకు కాపీ స్టాల్స్ ఏర్పాటుతో సేంద్రియ పద్ధతుల్లో కాఫీ సాగు చేసే లక్షా 50 వేల మంది గిరిజన రైతులకు మరో మారు జాతీయస్థాయిలో గౌరవం లభించింది.

# పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎస్.ఐ

మెలియాపుట్టి. మార్చి 24. మేజర్ న్యూస్..

.మెలియాపుట్టి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను స్థానిక ఎస్ఐ పి.రమేష్ బాబు సోమవారం పరిశీలించారు. ఇటీవల ఎచ్చెర్లలో జరిగిన మాస్ కాపీయింగ్ తెలిసిందే. దీంతో పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు తప్ప బయట వ్యక్తులు వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పకడ్బందీగా జరిగేందుకు అన్ని పరీక్ష కేంద్రాల్లో బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



# బాలికలకు స్కాలర్షిప్స్ ప్రకటించిన మలబార్

విశాఖపట్నం, మార్చి 24 మేజర్ న్యూస్

2024-2025 విద్యా సంవత్సరానికి , ఎ వి ఎన్ జూనియర్ కళాశాల లో బాలికల కోసం సామాజిక సంక్షేమ కార్యకలాపాలలో భాగంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ యొక్క మాతృ సంస్థ మలబార్ గ్రూప్, విద్యా స్కాలర్షిప్లను పంపిణీ చేసిందని మీడియా ప్రతినిధి తెలిపారు. ఈ ప్రోగ్రాం బాలికల విద్యకు మద్దతు ఇవ్వడంలో మలబార్ గ్రూపు యొక్క నిబద్ధతను నొక్కి చెబుతుందనన్నారు ఈ ఏడాది భారతదేశ వ్యాప్తంగా 21,000 మంది బాలికల విద్యకు మద్దతుగా ?16 కోట్ల రూపాయలను కేటాయించారని. ఆంధ్ర రాష్ట్రంలోని 142 కళాశాలల్లో చదువుతున్న 1,928 మంది బాలికల విద్యకు మద్దతుగా ఆంధ్ర రాష్ట్రంలో ఈ స్కాలర్షిప్ కార్యక్రమానికి గాను రూ 1.67 కోట్లు కేటాయించిందన్నారు. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహమ్మద్ ఈ కార్యక్రమం గురించి మాట్లాడుతూ, "ఈ ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన సాధనం విద్య. విద్యావకాశాలను విస్తృతం చేయడం, జీవితాలను మార్చడం అనే మలబార్ గ్రూప్ యొక్క బలమైన నమ్మకానికి ప్రత్యక్ష నిదర్శనం మా స్కాలర్షిప్ ప్రోగ్రామ్ అని సమాజంలో యువతులకు ఉన్న అడ్డంకులను తొలగించడానికి మేము కట్టుబడి ఉన్నామని, తద్వారా వారు తమ విద్యావకాశాలను




మెరుగుపరుచుకుని, తమ ఆకాంక్షలను నెరవేర్చుకుంటారని, సమాజానికి అర్థవంతంగా ఉపయోగపడతారన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులు బొడ్డేపల్లి రాధా, జిల్లా వృత్తి విద్యా అధికారిణి, ప్రొఫెసర్ జి పి రాజశేఖర్ వైస్ ఛాన్సలర్ ఆంధ్రా యూనివర్సిటీ ఎం సింహాద్రి నాయుడు, ప్రిన్సిపాల్ ఎ వి ఎన్ కళాశాల, విశాఖపట్నం మలబార్ గోల్డ్ డైమండ్స్ మేనేజ్మెంట్ టీం, వైజాగ్ సి ఎ జోన్ ఫెబిన్ స్టోర్ హెడ్ కె సునీత సఫాన్ తదితరులు పాల్గొన్నారు.

# సజీవ దహనం కేసులో 8 మంది గిరిజనుల అరెస్ట్

## పాడేరు డి.ఎస్.పి.షేక్ షెహబాబ్ అహ్మద్ వెల్లడి

అరకులోయ, మార్చి 24, మేజర్ న్యూస్:

సజీవ దహనం కేసుకు సంబంధించిన నిందితుల్లో 8 మంది గిరిజనులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు పాడేరు డి.ఎస్.పి. షేక్ షెహబాబ్ అహ్మద్ తెలిపారు. స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలతో ఓ అమాయక గిరిజనుడిని బలి తీసుకున్న 9 మంది గిరిజనుల్లో 8 మందిని మాత్రమే అదుపులోకి తీసుకోగలిగామన్నారు. ఈ సంఘటనలో పాలుపంచుకున్న మరో గిరిజనుడు పరారీలో ఉన్నాడని,అతి త్వరలో ఆ నిందితుడిని కూడా అరెస్టు చేస్తామని ఆయన చెప్పారు. అరకులోయ మండలం,లోతేరు పంచాయతీ,డుంబ్రిగుడ గ్రామానికి చెందిన అడారి. అర్జున్,అడారి.సింహాద్రి,అడారి.హరికృష్ణ,అడారి. గురునాథ్, అడారి.కమల, అడారి.సీతన్న, అడారి. గాసి, అడారి.మాణిక్, అడారి.చంద్ర రావు అను పేరు గల నిందితులు మూకుమ్మడిగా అదే గ్రామానికి చెందిన అడారి.డొంబు చేతబడి చేస్తున్నాడనే నెపంతో దాడి చేసి రాళ్లతో కొట్టి చంపి అతనిపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్టు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఆయన వివరించారు. దీంతో ఈ ఘటనపై కేసు నమోదు చేసి అమాయక గిరిజనుడిని సజీవ దహనం చేసిన గిరిజనులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈనెల 21వ తేదీన జరిగిన ఈ సంఘటనపై అరకులోయ పోలీసులు అన్ని కోణాల్లో విచారించి 48 గంటల్లో కేసును చేదించినట్టు ఆయన తెలిపారు. అతి తక్కువ సమయంలో కేసును చేదించిన స్థానిక సీఐ, స్థానిక ఎస్సై, పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా



డి.ఎస్.పి. అభినందించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ ఆదేశాల మేరకు గిరిజన గ్రామాల్లో మూఢనమ్మకాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పాడేరు డీఎస్పీ షేక్ షెహబాబ్ అహ్మద్ తెలిపారు. మూఢనమ్మకాల మధ్య మగ్గుతున్న అనేక మంది గిరిజనులు తోటి గిరిజనుల ప్రాణాలకు హాని తల పెడుతున్నారని, ఈ సంస్కృతి మంచిది కాదన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలకు మరెవరు పాల్పడకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మూఢనమ్మకాలపై గిరిజనులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు,పాత్రికేయులు, గిరిజన ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో అరకులోయ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్. హిమగిరి,పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ గోపాలరావు పాల్గొన్నారు.

# టీడీపీ తీర్థం పుచ్చుకున్న జడ్పీటీసీ, సర్పంచ్లు

మెలియాపుట్టి. మార్చి 24. మేజర్ న్యూస్ :

మెలియాపుట్టి వైసీపీ జడ్పీటీసీ గూడ ఎండయ్య, కొత్తూరు సర్పంచ్ వసంత్ కుమారి, వెంకటాపురం సర్పంచ్ బెంజమ్మ పాపారావు,సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంజీఆర్ వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలో కి ఆహ్వానించారు. జడ్పిటిసి గూడ



ఎండయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనరంజక పాలన సాగిస్తున్నారని, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మెలియాపుట్లో ఐటీడీఏ ఏర్పాటుకు శాసనసభలో ప్రస్తావించారని, అదేవిధంగా నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో మెలియాపుట్టి మండల మాజీ టిడిపి అధ్యక్షుడు అనపాన రాజశేఖర్ రెడ్డి, బమ్మిడి భాస్కరరావు, చంద్రశేఖర్ , తదితరులు పాల్గొన్నారు.

## చిన్నతుంగాం,మరువాడ పంచాయతీల్లో గ్రామసభలు

సంతబొమ్మాళి, మార్చి 24,మేజర్ న్యూస్ :

మండలం లో చిన్నతుంగాం గ్రామ పంచాయతీ లో సర్పంచ్ సిమ్మ గోవిందరావు అధ్యక్షతన పి ఫోర్ సర్వే పైన మరియు ఎమ్ జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ సోషల్ ఆడిట్ పైన గ్రామసభ నిర్వహించారు. అలాగే మరువాడ గ్రామ పంచాయతీ పరిధిలో ఎమ్.మరువాడ లో సర్పంచ్ సూరాడ.ధనలక్ష్మి దాసురాజు అధ్యక్షతన పి ఫోర్ సర్వే పైన మరియు ఎమ్ జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ సోషల్ ఆడిట్ పైన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభ లో మరువాడ పంచాయతీ కార్యదర్శి ప్రతాప్,సోషల్ ఆడిట్ డి ఆర్ పి సురేష్ గారు, చిన్న తుంగం ఉప సర్పంచ్ రత్నాల ప్రసాదరావు, చిన్నతంగం పంచాయతీ కార్యదర్శి డి శ్రీనివాస రావు, సోషల్ ఆడిట్ డి ఆర్ పి ఎమ్ అప్పారావు , ఎమ్ జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



# దళిత కుటుంబానికి న్యాయం చేయండి

**జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ను కోరిన ఏఐమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను**

**తహాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాలేదని ఫిర్యాదు**

కోటబొమ్మాళి, మార్చి 24, మేజర్ న్యూస్:

మండలం తిలారు పంచాయతీ పరిధిలోని తిలారు ఎస్.సి కాలనీకి చెందిన గుడివాడ రామారావు, గుడివాడ ప్రభావతిల కుటుంభానికి న్యాయం చేయాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ను అంబేద్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను కోరారు. కోటబొమ్మాళి తహాసిల్దార్ కార్యాలయం చుట్టూ ఆ కుటుంబం తిరిగినా వారి స్థల సమస్య పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఫిర్యాదు చేసారు. తిలారు ఎస్.సి కాలనీలో గుడివాడ రామారావు, ప్రభావతిలకి 1979-80 కాలంలో స్థలం ఇవ్వగా 1986లో ఇంటిని నిర్మించడం జరిగిందని తెలియజేసారు. ఆ ఇళ్ళు పాడైపోవడంతో పునర్నిర్మాణ పనులు చేపడుతుండగా స్థానికులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేసారు. ఈ విషయంపై గుడివాడ రామారావు కుటుంబ సభ్యులు కోటబొమ్మాళి తహాసిల్దార్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసామని తమ హద్దులు నిర్ణయించమని కోరినా ఇప్పటి వరకూ



చర్యలు తీసుకోలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కోటబొమ్మాళి తహాసిల్దార్ స్పందించకపోవడంతో న్యాయం జరిగేలా చూడాలని బాధితులు అంబేద్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీనును కలిసారు. వారి గోడు వెళ్లగక్కారు. బాధితులతో కలిసి ఏఐమ్ నాయకులు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ను కలసి రామారావు,ప్రభావతిలు ఎదుర్కొంటున్న ఇంటి సమస్యను వివరించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్.సి కాలనీలోని వారి స్థలం హద్దులు నిర్ణయించి సజావుగా ఇంటి పునర్నిర్మాణ పనులు చేపట్టుకునేలా సంబంధిత అధికారులకి ఆదేశాలు ఇవ్వాలని వారు జిల్లా కలెక్టర్ ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. సర్వే శాఖ ఏడికి తక్షణం సర్వే నిర్వహించి గుడివాడ రామారావు కుటుంబ సభ్యుల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ను కలసిన వారిలో గుడివాడ రామారావు, ప్రభావతిలతో పాటు పెయ్యల చంటి, సీర రాజేశ్వరి ,యారపాడు దేవా ,దువ్వారపు గణేష్ ,ముంజేటి జగన్నాథం తదితరులు ఉన్నారు.

## అప్పారావుకి బాడీ బిల్డింగ్ పోటీల్లో

# ప్రథమ స్థానం



అరకులోయ, మార్చి 24, మేజర్ న్యూస్:

మన్యం జిల్లా పార్వతీపురంలో ఈనెల 23వ తేదీ ఆదివారం నిర్వహించిన 31వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో అరకులోయకు చెందిన పిన్నింటి.అప్పారావు ప్రథమ స్థానంలో నిలిచారు. 8 జనరల్ గా,2 మాస్టర్స్ గా,1మెన్ ఫిజిక్ గా విభజించి నిర్వహించిన పోటీల్లో మాస్టర్స్ విభాగంలో గిరిజన ప్రాంతానికి చెందిన పిన్నింటి. అప్పారావు అనే బాడీ బిల్డర్ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఆంధ్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రథమ స్థానం దక్కించుకున్న పిన్నింటి.అప్పారావుకు షీల్డ్,మెడల్ తో పాటు కొంత నగదును బహుకరించారు. ఈ సందర్భంగా షీల్డ్ అందుకున్న అప్పారావు విలేకరులతో మాట్లాడుతూ 31వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బాడీ బిల్డర్ అప్పారావును పాత్రికేయులు, వర్తకులు,గిరిజన ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు అభినందించారు.

## విశాఖలో 30 మంది అనాథ చిన్నారులకు

# ఐపీఎల్ మ్యాచ్ చూసే అవకాశం కల్పించిన ఏసిఎ

విశాఖపట్నం, మార్చి 24 మేజర్ న్యూస్

ఐపీఎల్ లీగ్ లో భాగంగా సోమవారం వైజాగ్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఢిల్లీ క్యాపిటల్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ క్రికెట్ మ్యాచ్ ను గ్రౌండ్ లో వీక్షించే అవకాశం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ) 30మంది అనాథ చిన్నారులకు కల్పించింది. వైజాగ్ లోని పాపా హొమ్ అనాథ శరణాలయానికి 30 టికెట్లు తన సొంత నిధులతో కొని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అందజేసింది. మ్యాచ్ ను వీక్షించేందుకు విచ్చేసిన చిన్నారులకు ఏసిఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఏసిఏ కార్యదర్శి రాజ్యసభ ఎంపి సానా సతీష్, ఏసిఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్ చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కావాల్సిన సదుపాయాలు దగ్గరుండి చూశారు. కాసేపు వారితో సరదాగా కబుర్లు చెప్పారు. తమకు మ్యాచ్ చూసే అవకాశం కల్పించిన ఏసిఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆ చిన్నారులు కృతజ్ఞతలు తెలిపారు.



# కాశీకి రెగ్యులర్గా రైళ్లను నడపాలి

**- డీఆర్ఎం బోరాకు మాజీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు**



విశాఖపట్నం, మార్చి 24, మేజర్న్యూస్ :

విశాఖ నుంచి కాశీకి రెగ్యులర్గా రైళ్లను నడపాలని మాజీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు కోరారు. ఈ మేరకు విశాఖ రైల్వే డీఆర్ఎం లలిత్ బోరాను సోమవారం ఆయన కార్యాలయంలో కలిసారు. ఈ సందర్భంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ భవన నిర్మాణ తీరుపై వాకబు చేశారు. రాజస్థాన్, బీహార్, హర్యానాలకు చెందిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు కలసి రైల్వేకి సంబంధించిన పలు సమస్యలను వివరించారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు విశాఖ నుంచి కాశీకి ప్రత్యేక రైలును నడిపినట్టు వెల్లడించారు. అలాగే గయ రైలును రెగ్యులర్ చేయాలని కోరారు. తద్వారా గయకు పితృ దేవతలకు పిండ ప్రధానాలు చేయడానికి వీలుగా తెలుగు ప్రజలకు ఉపయోగం ఉంటుందన్నారు. అలాగే విశాఖ నుంచి జోధ్పూర్కు ప్రయాణించే రైలు ప్రతీ రోజు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామ రాజు, గాజువాక కన్వీనర్ కేఎన్ఆర్, వివిధ రాష్ట్రాలకు చెందిన రైల్వే ప్రతినిధులు పాల్గొన్నారు.

